RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 14 ISSUE NO : 14 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, జూలై 1, 2025 Tuesday, July , 1, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /- |
|---|---|---|---|---|---|



తెలంగాణ బీజేపీ అధ్యక్షుడుగా

## రామచంద్రరావు!

బీజేపీ అధ్యక్ష పదవికి రామచంద్రరావును ఖరారు చేసిన పార్టీ అధిష్ఠానం

నామినేషన్ దాఖలు చేసిన రామచంద్రరావు

ఈ రోజు మధ్యాహ్నం అధికారిక ప్రకటన

**హైదరాబాద్,జూన్ 30,తెలంగాణ దిశ:**
తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. పార్టీ రాష్ట్ర నూతన సారథిగా మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు బాధ్యతలు చేపట్టనున్నారు. పార్టీ అధ్యక్ష పదవికి రామచంద్రరావు పేరును పార్టీఅధిష్టానం ఖరారు చేసింది. దీంతో అధ్యక్ష ఎన్నిక నామినేషన్‌గడువు ముగిసేసమయానికి ఒకేఒక్క నామినేషన్ దాఖలైంది. పార్టీ అధిష్టానఆదేశాల మేరకు రామచంద్రరావు నిన్న నామినేషన్‌దాఖలు చేశారు. అధ్యక్షుని ఎన్నిక ఏకగ్రీవం అయింది.రామచంద్రరావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయనఎంపిక లాంఛనప్రాయం అయింది. పార్టీ అధ్యక్ష పదవిరేసులో బండి సంజయ్, ధర్మపురి అరవింద్, కెలక్ష్మణ్,డీకే అరుణ,రాజా సింగ్ తదితరుల పేర్లు వినిపించినప్పటికీ, పార్టీ అధిష్టానం రామచంద్రరా వు వైపు మొగ్గుచూపింది. పార్టీఅధ్యక్ష పదవిని ఆశించిన ఎమ్మెల్యే రాజాసింగ్ ఏకంగా పార్టీకి రాజీనామా చేశారు.

# కెమికల్ ఫ్యాక్టరీలో

# పేలిన రియాక్టర్

## 12మంది కార్మికుల మృతి

సంగారెడ్డి పాశమైలారం పారిశ్రామిక వాడలోని కెమికల్ ఫ్యాక్టరీలో ఘటన

ఘటనపై సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. - క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



**హైదరాబాద్,జూన్ 30,తెలంగాణ దిశ:**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పరిధిలోని పాశమై లారం పారిశ్రామిక వాడలో ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. స్థానిక సీగాచి కెమికల్స్ పరిశ్రమలో రియాక్టర్ ఒక్కసారిగా పేలడంతో భారీ ప్రమాదం సంభవించింది. దీంతో కార్మికులు పనిలో ఉన్న సమ యంలోనే అకస్మాత్తుగా మంటలు ఎగసిపడటం, పేలుడుతో పరిసరాలు దద్దరిల్లిపోయాయి. పేలుడు ధాటికి పరిశ్రమ పరిధిలో పనిచేస్తున్న కార్మికులు గాల్లోకి ఎగిరి పడిపోయినట్టు స్థానికులు తెలిపారు. సుమారు 100 మీటర్ల దూరం వరకు శరీర భాగాలు ఎగిరిపడ్డాయని ప్రత్యక్షదారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 12మంది కార్మికులు మృతి చెందగా, ఇంకా 20 మంది పైగా తీవ్రంగా గాయపడ్డారు.
ప్రమాద సమాచారం అందుకు న్న వెంటనే రెండు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్ని స్తున్నాయి. తీవ్ర గాయాలపాలైనవారిని అంబులెన్సుల్లో సమీప ఆసుపత్రులకు తరలించారు. పేలుడు సమయం లో పరిశ్రమలో ఉన్న పలువురు కార్మికులు బయటకు పరుగులు తీస్తూ ప్రాణాలు కాపాడుకున్నారు. అయితే పేలుడు శబ్దం దూరం వరకు వినిపించడంతో పరిసర ప్రాంతాల్లోని స్థానికులు కూడా భయాందోళనకుగుంయ్యారు. పరిశ్రవ వద్దకు పెద్ద ఎత్తున స్థానికులు, సహచర కార్మికులు చేరుతున్నారు. ఇప్పటికే ఐదుగురు మృతిచెందగా, గాయాలపాలైన కొందరి పరిస్థితి విషమంగాఉండటంతో మృతులసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పరిశ్రమలో ఇంకా మంటలు కొనసాగుతుండటంతో రక్షణ చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రమాదానికి గల కార ణాలు ఇప్పటికి స్పష్టంగా తెలియకపోయినా, రియాక్టంలో ఏదైనా సాంకేతికలోపం వల్లేపేలుడు సంభవించి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.



పాశమైలారం ఘటన

## బాధాకరం


మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా : ప్రధాని మోదీ

ఢిల్లీ: సంగారెడ్డి ఫ్యాక్టరీ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమ న్నారు. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా అందిస్తాం” అని ప్రధాని మోదీ తెలిపారు.పటాన్‌చెరు పారిశ్రామికవాడ పాశమైలారంలో సోమ వారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. సిగాచి కెమికల్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలింది. పేలుడు ధాటికి కంపెనీకి సంబంధించిన అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ సహా చాలా భాగం దెబ్బతింది. ఆ సమయంలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ పరిసరాల్లోనే భారీ సంఖ్యలో కార్మికులు ఉన్నట్లు సమాచారం.

పాశమైలారం ప్రమాదంపై

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతాపం

**హైదరాబాద్,జూన్ 30,తెలంగాణ దిశ:**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో పాశమైలారంలోని సీగాచి కెమికల్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలిన సంగతి తెలిసిందే. ఈ భారీ ప్రమాదంలో ఇప్పటి వరకు 13 మంది చనిపోగా.. మరో 35 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 100 పైగా మంది కార్మికులు ఉన్నట్టు సమాచారం. అయితే ఈ ఘటనపై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ ద్వారా ప్రమాదానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరణించిన కార్మికులకు సానుభూతి వ్యక్తం చేస్తూ.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను గవర్నర్ గవర్నర్ జిష్ణుదేవ్ ఆదేశించారు.



# బీజేపీకి ఎమ్మెల్యే రాజాసింగ్ గుడ్ బై..!



రాజీనామా లేఖ కిషన్‌రెడ్డికి

## అందజేసిన రాజాసింగ్

**హైదరాబాద్,జూన్ 30,తెలంగాణ దిశ:**
గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ బిజెపికి రాజీనామా చేశారు. పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ వెయ్యనివ్వలేదని, అందుకే రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. తన రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి పంపించినట్లు తెలిపారు. హైదరాబాద్ లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, పార్టీకి రాజీనామా చేయడంతో తన ఎమ్మెల్యే పదవి రద్దు చేయాలని కోరుతూ స్పీకర్ లేఖ పంపాలని కిషన్ రెడ్డిని కోరినట్లు వెల్లడించారు. పార్టీ కోసం ఎంతో కాలం కష్టపడ్డా, అధికారం లోకి రావాలని ఎంతో కృషి చేశా.. అయినా పార్టీలో గుర్తింపు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.. పార్టీకి చేసిన సేవ కారణంగా తాను, తన కుటుంబం ఉగ్రవాద హిట్‌లిస్ట్ లో ఉన్నామని గుర్తు చేశారు.. రాష్ట్రంలో పార్టీ గెలువకూడదని అనుకునే వాళ్ల సంఖ్య రోజు రోజుకి అవుతుందన్నారు. అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడానికి వచ్చానని, అయితే వేయకుండా అడ్డుకోవడమే కాకుండా తన మద్దతుదారులను బెదిరించార న్నారు.. పార్టీలో గుర్తింపు, విలువలేనప్పుడు ఇక ఆ పార్టీలో ఉండలేనని అన్నారు. మీకు .. మీ పార్టీకి ఒక దండం అంటూ కమలనానికి గుడ్ బై చెప్పారు..

పాశమైలారంలో ఇది

# మూడో ఘటన: హరీష్

**హైదరాబాద్,జూన్ 30,తెలంగాణ దిశ:**
పటాన్‌చెరు పారిశ్రామికవాడ పాశమైలారంలో కెమికల్ ఫ్యాక్టరీ పేలుడు ఘటనపై మాజీ మంత్రి హరీష్‌రావు స్పందించారు. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారాయన. సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. “పాశమైలారంలో ఈ మధ్యకాలంలో జరిగిన ఇది మూడో ఘటన. అయినా కూడా జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే. ఈ ప్రమాదంపై న్యాయ విచారణ జరిపించాలి. ఎంత మంది చనిపోయారో కూడా క్లారిటీ లేదు. ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి. మృతి చెందిన వాళ్ల కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలి. గాయపడిన వాళ్లకు రూ. 50 లక్షలు అందించాలి” అని ప్రభుత్వాన్ని హరీష్ రావు డిమాండ్ చేశారు. గాయపడ్డ 26 మందికి ఆస్పత్రుల్లో చికిత్స అందుతోంది. వాళ్లకు మెరుగైన వైద్యం అందాలి. అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించాలి అని హరీష్ రావు కోరారు. సోమవారం ఉదయం 9గం. ప్రాంతంలో పాశమైలారంలోని కెమికల్ ఫ్యాక్టరీలో రియాక్టర్ పేలడంతో ఘోర ప్రమాదం సంభవించింది. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ సహా చాలా ప్రాంతం కుప్పకూలిపోగా.. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.



నక్సల్స్‌తో చర్చలు

# జరపాలని కోరడం తప్పా..?

## కేంద్రమంత్రి అమిత్ షాపై టీపీసీసీ చీఫ్ ఫైర్



**హైదరాబాద్,జూన్ 30,తెలంగాణ దిశ:**
శాంతిభద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీపడే ప్రసక్తే లేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశా రు. కేంద్రంలో ఫాసిస్ట్ మోడీ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికా ర్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. హైదరాబాద్, జూన్ 30: కాంగ్రెస్ పార్టీ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ ఖండిం చారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నక్సల్స్‌ను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. ఆపరే షన్ కగార్ విషయంలో నక్సల్స్‌తో చర్చలు జ రపాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. దేశంపై దాడి చేసిన టెర్రరిస్ట్‌ల విషయంలో బీజేపీ ఎలాంటి ధోరణి వ్యవహరించిందో అంతా చూశారన్నారు. ‘ట్రంప్ ఆదేశిస్తే.. టెర్రరిస్ట్‌ల విషయంలో వెనకడుగు వేసిన మీరా మమ్మల్ని విమర్శలు చేసిది’ అంటూ ఫైర్ అయ్యారు. శాంతి భద్రతలు, దేశ రక్షణ విషయంలో కాంగ్రెస్ రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్‌తో యుద్ధం చేసిట్రంప్ చెప్తే మధ్యలో ఆపేశారని దుయ్యబట్టారు. దేశపౌరులు లెఫ్ట్ ఉద్యమంలోఉంటేవారితో సీజ్ ఫైర్ చేసి వారితో ఎం దుకు చర్చలు జరపరని ప్రశ్నించారు.కేంద్రంలో ఫాసిస్ట్ మోడ పాలనకు వ్యతిరేకంగా ఏఐసీసీ చీఫ్ మల్లి కార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్నారని తెలిపారు. జూలై 4నఎల్బీస్టేడియంలో జరిగేగ్రామస్థాయి అధ్యక్షుల సభలో ఖర్గే పాల్గొంటారని తెలిపారు.


పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న

# రేవంత్ సర్కార్

జవహర్‌నగర్‌లో ఇళ్ల కూల్చివేతలపై

## ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం

**హైదరాబాద్,జూన్ 30,తెలంగాణ దిశ:**
నగరంలో ‘హైడ్రా’ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ల కూల్చివేతలు తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. ఈ కూల్చివేతలపై మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఈరోజు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జవహర్ నగర్‌లో పర్యటించిన ఆయన, పేద ప్రజల ఇళ్లను కూల్చివేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈటల మీడియాతో మాట్లాడుతూ.. 30, 60 గజాల స్థలంలో ఇల్లు కట్టుకునేవాడు ధనవం తుడా లేక నిరుపేదో ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. “చిన్న స్థలాల్లో గూడు కట్టుకుంటున్న వారిపై మీ ప్రతాపం చూపించడం సిగ్గుచేటు. మురు?ల్లారా.. మీకు కళ్లు కనబడటం లేదా?” ద్వారా ప్రభుత్వానికి ఏం లభిస్తుందని ఆయన నిలదీశారు.



# తెలంగాణ బీజేపీలో రాష్ట్ర అధ్యక్ష పదవి చిచ్చు..!

## రాజాసింగ్ బాటలో మరికొంత మంది?

**హైదరాబాద్,జూన్ 30,తెలంగాణ దిశ:**
తెలంగాణ బీజేపీలో అధ్యక్ష పదవి చిచ్చు రాజేసింది. మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావుకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించా లన్న అధిష్టానం నిర్ణయానికి నిరసనగా సొంత పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ బీజేపీ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో ఈ వ్యవహారం కమలం పార్టీలో కల్లోలానికి దారి తీసింది.



## క్రీడల అభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి



హైదరాబాద్, జూన్ 30, (తెలంగాణ దిశ) :క్రీడల అభివృద్ధి కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. క్రీడాకారుల డేటాను డిజిటలైజేషన్ చేయాలని ఆయన సూచించారు. సోమవారం ఎల్ బి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కార్యక్రమాలను మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, ఇందు కోసం నెలవారీ సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన కొత్త క్రీడా విధానం దేశానికి ఒక నమూనా అని ఆయన పేర్కొన్నారు. క్రీడల అభివృద్ధి కోసం అధికారుల వద్ద సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ముఖ్యమంత్రి ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలను చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలా దేవి, డిప్యూటీ డైరెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అధికారులను వెనకేసుకొస్తూ... సామాన్యులపై చర్యలా..?

# పూర్వ అధికారులపై చర్యలు తీసుకోవాలి

### హైడ్రా అధికారులు పున:పరిశీలించాలి-ఆగ్రహం వ్యక్తం చేసిన పీఏసీ చైర్మన్ గాంధీ







**శేరిలింగంపల్లి, జూన్ 30, (తెలంగాణ దిశ) :**మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాదాపూర్ లో గల సున్నం చెరువు లో జరుగుతున్న పను లను హైడ్రా అధికారులతో కలిసి పరిశీలించి, చెరువు ఎఫ్ టిఎల్ బఫర్ జోన్ సరిహద్దులను నిర్ణయించిన తర్వాత పనులు చేపట్టాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సున్నం చెరువు పరిధిలోని ఎఫ్ టిఎల్ బఫర్ జోన్ సరిహద్దులు నిర్ణయించి పనులు ప్రారంభించాలని హైడ్రా అధికారులను కోరారు. గతంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల తప్పిదాల వలన చెరువు సరిహద్దులను మార్చడం జరిగినదని, చెరువు పూర్తి స్థాయిలో సరిహద్దులు నిర్ణయించిన తర్వాతే పనులు చేపట్టాలని, గతంలో తప్పిదాలు చేసి, వాస్తవాలను కప్పి పుచ్చి హైడ్రా అధికారులను తప్పుదోవ పట్టించిన అధికారులను కఠినంగా శిక్షించాలని చైర్మన్ గాంధీ సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూర దృష్టితో హైడ్రాను ఏర్పాటు చేసి చెరువులు, నాలాల కబ్జాల నుండి రక్షించడానికి ఏర్పాటు చేశారని, కానీ హైడ్రా అధికారులను తప్పుదోవ పట్టించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను శిక్షించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో సున్నం చెరువు కబ్జాకు గురి అవుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో పార్లమెంట్ సభ్యునిగా, ప్రతిపక్ష నేత గా ఉన్న సమయంలో చెరువులను సందర్శించి, చెరువు కబ్జాల నుండి కాపాడాలని కఠిన చర్యలు తీసుకోవాలని కోరగా నేటి వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని, భూ కబ్జాదారులు పెట్రేగిపోతున్నారని అన్నారు. కావున భూ కబ్జాదారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చెరువును పరిరక్షించాలని, చెరువులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని, కబ్జాలకు పాల్పడుతున్న ఎంతటి వారైన ఉపేక్షించే ప్రసక్తే లేదని చైర్మన్ గాంధీ హెచ్చరించారు. సున్నం చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో



జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చి వేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ సీఈ, సైబరాబాద్ సీపీలకు లేఖలు రాశానని చైర్మన్ గాంధీ తెలిపారు. చెరువు ఒక వైపు పూడ్చి వేసిన వారిని వదిలేసి సీఎస్ సొసైటీ లో పేద, మధ్య తరగతి ప్రజల ప్లాట్ల ను మాత్రం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం బాధాకరం, ముందు చెరువు సరిహద్దు లను నిర్ణయించి చెరువు పనులు ప్రారంభించాలని , చెరువు విస్తీర్ణం పూర్తి స్థాయిలో నిర్ణయించాలని, ఒక వైపు చెరువు కబ్జా కు గురి అవుతే మరొక వైపు కూల్చడం లో అంత్యర్యం ఏమిటో అర్థం కావట్లేదని గాంధీ విస్మయం వ్యక్తం చేశారు. చెరువును గతంలో మట్టి తో పూడ్చినప్పుడు అప్పటి ఎమ్మార్వో అధికారులు అందరూ కలిసి పూడ్చిన మట్టిని జేసీబీల సహాయంతో తీసివేసి చెరువును పరి రక్షించా మని, ఎన్నికల సమయంలో ఇదే అదునుగా భావించి కబ్జాదా రుల ప్రహరి గోడలు ,చెట్లు పెంచడం ,నిర్మాణం పనులు చెప్పటి చెరువును కబ్జా చేయడం జరిగినది అని, అప్పట్లో రోడ్డు వేయడానికి ఇరిగేషన్ అధికారులు అనుమతి ఇవ్వలేదు కానీ ఇపుడు ఏకంగా చేరువునే పూడ్చి వేయడానికి అనుమతి ఎలా ఇచ్చారు అని అధికారులను ప్రశ్నించారు. చెరువులను కాపాడాల్సిన వారే బక్షిస్తే ఎలా అని, చెరువులు కాల్వలు, నాళాలు తూడ్చుకుంటూ పోతే భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తుతుందని, ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిన వారిమి అవుతామని, బాధ్యతతో చెరువులను సంరక్షించాలని, అందరి బాధ్యత అని, ఫెన్సింగ్ ఉన్న, హద్దులను తొలగించి యధేచ్ఛగా చేరువు ను మట్టి తో నింపి కబ్జాకు పాల్పడినారని చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఇకనైనా అధికారు లు మేల్కొని అక్రమ కట్టడాలు కూల్చివేసి పాత ఫెన్సింగ్ ప్రకారం చెరువును యథాస్థితికి తీసుకురావాలని చెరువును పూర్తి స్థాయిలో పునరుద్ధరించి చెరువు చుట్టూ ఫెన్సిగ్ వేసి చెరువు మళ్ళీ కబ్జాకు గురి కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని చైర్మన్ గాంధీ డిమాండ్ చేశారు.

### పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ

# అవగాహన కలిగి ఉండాలి

**మాజీ కౌన్సిలర్ పంగా హరిబాబు**

నాగారం, జూన్ 30, (తెలంగాణ దిశ) : భారత రాజ్యాంగం ద్వారా లభించిన పౌర హక్కులపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పంగా హరిబాబు అన్నారు. సోమవారం నాగారంలో పౌర హక్కుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమానంగా, చట్టం ముందు సమాజం లో గౌరవంగా ఉండటానికి హక్కులు కలిగి ఉంటారని తెలిపారు. పౌర హక్కుల దినోత్సవం ప్రతి నెల చివరి రోజున జరుపుతారని అన్నారు. పౌర హక్కులపై అవగాహనా కలిగి ఉండటం ద్వారా సమాజంలో ప్రతి ఒక్కరు సమానత్వభావంతో, సమాజంలో వివక్షతను ఎదుర్కోకుండా గౌరవంగా బ్రతకడానికి సహాయపడుతుందని తెలిపారు. పౌరహక్కుల అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం ఇలాంటి అవగాహనా సమావేశాలు నిర్వహించడం ద్వారా పౌరులు సమాజంలో అభద్రతా – వివక్ష– ఆత్మనూన్యతా భావం తొలగి స్వేచ్ఛా, సమానత్వంతో




ఆత్మ స్థైర్యం తో జీవించగలరని తెలిపారు. కుల–మత–ప్రాంత వైరుధ్యాలు– విద్వేషాలు తొలగి పౌరులు ఐకమత్యంతో దేశ అభ్యున్నతి కోసం పాటుపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కీసర ఆర్ఐ విశ్వనాథ్, కీసర ఎస్ఐ హరి ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ రాజు, జూనియర్ అసిస్టెంట్ సాయిరాజ్, మాజీ ఎంపీటీసీ పంగ ముత్యాలు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు లింగం, మల్లేష్, వామన్ రావు,అశోక్, సోమయ్య, రవీందర్, రమేష్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ట్రాలీ మీద పడి పెయింటర్ దుర్మరణం

**కుత్బుల్లాపూర్, జూన్ 30, (తెలంగాణ దిశ) :**హైడ్రాలిక్ ట్రాలీ జారీ మీద పడడంతో పెయింటర్ దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. జీడిమెట్ల పోలీసుల కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బలియా జిల్లా సురయ్యపు గ్రామానికి చెందిన ఉపేందర్ కుమార్ (35) గత 20 సంవత్సరాల క్రితం బ్రతుకుతెరువు కొరకు హైదరాబాదు నగరంలోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తూ పెయింటింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. నెల రోజుల క్రితం స్థానిక సుభాష్ నగర్ ప్రాంతంలోని పవన్ బాడీ బిల్డింగ్ సంస్థలో పెయింటింగ్ పనులు నిర్వహించడానికి రమ్మంటూ ఆ సంస్థ యజమాని అనిల్ ఉపేందర్ ను పిలిపించుకొని ఒప్పందం కుదుర్చుకున్నాడు. దీంతో నెల రోజులుగా ఉపేందర్ అదే పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పెయింటింగ్ పనులు నిర్వహిస్తున్న ఉపేందర్ కుమార్ పై హైడ్రాలిక్ ట్రాలీ మీద పడడంతో తీవ్ర గాయాలపాలై ఉపేందర్ కుమార్ మరణించారు. ఈ విషయమై ఉపేందర్ సమీప బంధువు మనోజ్ రాముకు సోమవారం ఉదయం 10 గంటలకు పరిశ్రమ యజమాని అనిల్ సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లిన మనోజ్ రాముకు ఉపేందర్ కుమార్ మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించాం అని కంపెనీ యజమాని చెప్పాడు. దీంతో మనోజ్ రామ్ ఈ విషయమై జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పవన్ బాడీ బిల్డింగ్ యజమాని అనిల్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఉపేందర్ కుమార్ మరణించాడని




ఫిర్యాదు దారు పోలీసులకు వివరించాడు. మృతుడు ఉపేందర్ కుమార్ పనిచేస్తున్న స్థలంలో పరిశ్రమ యజమాని తగు రక్షణ పరికరాలను అందించనందునే ఈ ప్రమాదం చోటు చేసుకుందని తెలిపాడు. ఉపేందర్ కుమార్ మరణానికి కారణమైన పవన్ బాడీ బిల్డింగ్ యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జీడిమెట్ల పోలీసులు మృతదేహాన్ని పోస్టూర్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి నుండి పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఉపేందర్ కుమార్ పెయింటింగ్ చేస్తున్న సందర్భంలో పై అంతస్తు నుండి హైడ్రాలిక్ ట్రాలీ జారి ఉపేందర్ కుమార్ పై పడడంతో మృతునికి తల, చాతి శరీర భాగాలపై బలమైన గాయాలయ్యాయి. దీంతో అతనికి తీవ్ర రక్తస్రావమై మరణం సంభవించి ఉండవచ్చు అని జీడిమెట్ల పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా శ్రీ వారహి అమ్మవారి ఆషాడ గుప్త నవరాత్రులు

**కుత్బుల్లాపూర్, జూన్ 30, (తెలంగాణ దిశ):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని మహాదేవపురం, షిరిడిహిల్స్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శ్రీశ్రీ హర్షిత్ మహారాజ్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వారహి అమ్మవారి ఆషాడ గుప్త నవరాత్రుల సందర్భంగా పంచబలి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.
అనంతరం శ్రీ వారహి అమ్మవారికి హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో సాధనందగౌడ్, బుచ్చిరెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, వెంకట్ రెడ్డి, షిరిడిహిల్స్ కాలనీ ప్రెసిడెంట్ రమేష్, ప్రధాన కార్యదర్శి సత్య, రంగారావు తదితరులు పాల్గొన్నారు.



### నాలా, అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు

# చేపట్టి ట్రాఫిక్ రద్దీని తగ్గించాలి

**బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, జూన్ 30, (తెలంగాణ దిశ) :**ప్రజా సమస్యల పరిష్కారమే కోసమే కాలనీలలో పర్యటిస్తున్నట్లు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. సోమవారం కుత్బుల్లాపూర్ డివిజన్ రామిరెడ్డి నగర్, పాపయ్య యాదవ్ నగర్ లలో వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సుచిత్ర, అల్వాల్, బ్యాంక్ కాలనీ వంటి ప్రాంత వాసులు త్వరగా వారి గమ్య స్థానాలను చేరేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఐడిపిఎల్ నుంచి రామ్ రెడ్డి నగర్, పాపయ్య యాదవ్ నగర్ ల మీదుగా ఉన్న రోడ్డుపై ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక సంఖ్యలో వాహనాలు తిరగడం వల్ల తీవ్ర రద్దీగా మారుతుందని, పోటీ పరీక్షల సమయాల్లో అయితే ఇది మరింత రద్దీగా మారుతుందని తద్వారా పిల్లలు, కాలనీలలోని వయోవృద్ధులు ఆ రోడ్డులో నడవలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను తగ్గించేందుకు ఐడిపిఎల్ నుంచి దిల్ ఖుషునగర్ వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణము చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యే ను కోరారు. అదేవిధంగా పాపయ్య యాదవ్ నగర్, రాంరెడ్డి నగర్ లలో నెలకొని ఉన్న కల్వర్టు నిర్మాణ పనులు, బ్రిడ్జి నిర్మాణం, విస్తరణ, 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు, మసీదు నుండి భూగర్భ డ్రైనేజీ పనులను చేపట్టడం వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.... ఐడిపిఎల్ నుంచి దిల్ కుష్ నగర్ వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణంతోపాటు, నాలా బ్రిడ్జి పనులను, రామిరెడ్డి నగర్ లో నూతన కల్వర్టు నిర్మాణం, భూగర్భ



డ్రైనేజీ పనులను, ప్రధాన రహదారిని 100 ఫీట్లకు విస్తరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతంలో 2020వ సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వము గెజిట్ ద్వారా దిల్ కుష్ నగర్ నుంచి పాపయ్య యాదవ్ నగర్ వరకు చేపట్టడం జరిగిందని, తద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించామని, ఈ ఐడిపిఎల్ మెయిన్ రోడ్డు నుంచి రామ్ రెడ్డి నగర్, పాపయ్య యాదవ నగర్ లకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్యను మరింత పరిష్కరించవచ్చని అన్నారు. అనంతరం స్థానిక హనుమాన్ దేవాలయం నందు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈ పాపమ్మ, ఏఈ అనురాగ్, మాజీ కార్పొరేటర్ కెఎం.గౌరీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, నాయకులు సురేందర్ రెడ్డి, బొంబాయి శ్రీను, నార్లగంటి బాలయ్య, నార్లకంటి రమేష్, రమణారెడ్డి, రామిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యాదవ రెడ్డి, ఉపాధ్యక్షులు హీరాలాల్ భాటి, పాపిరెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి

**- తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జెయు) హనుమకొండ జిల్లా కమిటీ ఎన్నిక- పత్రికల ఎంప్యానల్ మెంట్ వెంటనే చేపట్టాలి- తెలంగాణ ప్రెస్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి**



**హనుమకొండ, జూన్ 30, (తెలంగాణ దిశ) :**ప్రజాస్వామ్యంలో మూల స్తంభాలలో నాలుగవ స్తంభం లాంటి జర్నలిస్టులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో దాడులు పునరావృతం అవుతున్నాయని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ అన్నారు. సోమవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ హన్మకొండ జిల్లా కమిటీ ఎన్నిక జిల్లా కేంద్రంలో జరిగినది. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడుల నిరోధానికి ప్రభుత్వం ఒక ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందించే అమలు చేయడం వల్ల దాడులను నివారించవచ్చునని సూచించారు. ప్రభుత్వం ఎప్పటి కప్పుడు తాత్కాలికమైన నిర్ణయాలు తీసుకోకుండా జర్నలిస్టుల సంబంధిత అవసరాలను పరిగణలోకి తీసుకొని ఒక సమగ్రమైన మీడియా పాలసీని రూపొందించి దేశానికే ఆదర్శంగా నిలవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన తో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంలో కీలక పాత్ర పోషించిన పత్రికలు, చానల్స్ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు అదే విధంగా ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న స్థానిక పత్రికల ఎం ప్యానల్ ఎంపానెల్ మెంట్ వెంటనే చేపట్టి రుణభారంతో బ్రతుకులీడుస్తున్న పాత్రికేయులను ఆదుకోవాలని అన్నారు.
ఇప్పుడు ఉన్న యూనియన్లు జర్నలిస్టుల సంక్షేమం కోసం కాకుండా తమ వ్యక్తి గత ప్రయోజనాలకే పరిమితమయ్యాయని ఆయన విమర్శించారు. అలా కాకుండా తాము ఒక ప్రత్యామ్నాయ జర్నలిస్టు ఉద్యమ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని అన్నారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
హన్మకొండ జిల్లా అధ్యక్షుడిగా ముత్తోజు రాము, ప్రధాన కార్యదర్శిగా దొరి హరికృష్ణ , కోశాధికారిగా గణపనేని చంద్ర శేఖర్, ఉపాధ్యక్షులుగా పబ్బు రాజ్ కుమార్, ఆర్. అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శులు దాడి బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మంద సదానందం, బెల్లంపల్లి చరణ్, ఈసీ మెంబర్లుగా గోక శ్రవణ్, పొన్నాల సురేష్ లు ఎన్నికయ్యారు.

# సంపాదకీయం

## అఘాయిత్యాల పరంపర...!

రాష్ట్రంలో మహిళలు, బాలికలపై హత్యాచారాలు, దాడులు, లైంగిక వేధింపులు మిక్కిలి గగుర్పాటుకు గురి చేస్తున్నాయి. ఒక ఘాతుకం మర్చిపోకముందే మరొకటి చోటు చేసుకొని స్త్రీలను బెంబేలెస్తున్నాయి. ఒక్కో ఘటన చూస్తుంటే వింటుంటే మనం ఉన్నది నాగరిక సమాజంలోనా మధ్య యుగాల్లోనా అనేంత పాశవికంగా జరుగుతున్నాయి. వారం రోజుల్లోనే రాష్ట్రంలో ఇద్దరిపై గ్యాంగ్ రేప్, మరో ఇద్దరిపై ఘోర దాడులు ముంచుకొచ్చాయి. శ్రీసత్యసాయి జిల్లాలో అత్తా కోడళ్లపై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కడప జిల్లా బద్వేలులో ఇంటర్ విద్యార్థినిపై ఆమె స్నేహితుడే పెట్రోలు పోసి తగలబెట్టగా, 90 శాతం గాయాలతో ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి చివరికి ప్రాణాలు విడవడం అత్యంత బాధాకరం. తెనాలిలో నర్సు దాడికి గురై బ్రెయిన్ డెడ్ స్టేజిలో గుంటూరు జనరల్ ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతోంది. ఇటీవలే నంద్యాల జిల్లాలో ఎనిమిదేళ్ల బాలిక అత్యాచారానికి, హత్యకు గురైంది. జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వారానికే బాపట్ల జిల్లా చీరాల వద్ద పంట పొలాల్లో మహిళ మృతదేహాన్ని గుర్తించగా ఆమె సామూహిక అత్యాచారం, హత్యకు గురైందని ప్రాథమికంగా పోలీస్ దర్యాప్తు చేపట్టారు. ఇవి లోకానికి తెలిసొచ్చిన అఘాయిత్యాల్లో కొన్ని మాత్రమే. బయటికి రానివి ఇంకా ఎన్ని ఉన్నాయో తెలీదు.మహిళలపై నేరాలు ఇంతగా పెచ్చుమీరడానికి ఉన్మాదులు యథేచ్ఛగా చెలరేగి పోవడానికి ప్రధాన కారణం నేరం చేయకూడదన్న భయం లేకపోవడమే. సత్వర దర్యాప్తు, నిందితులకు చట్ట ప్రకారం శిక్షలు పడితేనే నేరాలు అదుపులోకి వస్తాయి. ఉదాహరణకు జూన్‌లో బాపట్ల జిల్లాలో మహిళ హత్యాచారానికి గురైతే ఇప్పటికీ కేసు అతీగతీ లేదు. అలాంటిదే ఇంకో ఘటన జరిగాక తీరిగ్గా ఇప్పుడు ప్రత్యేక కోర్టులని, హైకోర్టుకు లేఖ రాస్తామంటున్నారు ముఖ్యమంత్రి, హోం మంత్రి. ఆడపిల్లపై చేయి వేసిన వాడికి అదే చివరి రోజవతుందని సి.ఎం, హోం మంత్రి నాలుగు మాసాల్లో ఎన్నో సార్లు హూంకరించినా ఘోరాలు ఆగింది లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలపై, చిన్న పిల్లలపై నేరాలు 74 జరిగాయన్నది ఒక లెక్క. ఆరుగురు హత్యకు గురికాగా, మరో ఐదుగురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అలాగని ఈ ప్రభుత్వం వచ్చాకనే మృగాళ్లు పుట్టుకొచ్చారని కాదు. గత ప్రభుత్వంలోనూ మహిళలపై కిరాతకాలు జరిగాయి. దిశ పోలీస్‌స్టేషన్లు, యాప్ అన్నా ఘోరాలు నిరాటంకంగా జరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం వల్లిస్తున్న ఫాస్ట్ ట్రాక్, స్పెషల్ కోర్టులు, నేరస్తులపై ఉక్కుపాదం వంటివి కూడా ఆ కోవలోనివే. అప్పుడూ ఇప్పుడూ మహిళలే సమిధలవుతున్నారు. కేంద్రంలో మోడీ పాలన వచ్చాక దేశ వ్యాప్తంగా, ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అఘాయిత్యాలు ఒక ధోరణిగా మారిపోయాయి. నయా-ఉదారవాదం, మతోన్మాదాలే మహిళలపై హింసను ప్రేరేపిస్తున్నాయన్నది వాస్తవం. మణిపూర్‌లో కొన్ని నెలలపాటు కీచకపర్వం నడిచింది. ఇంకా నడుస్తోంది. అందుకు బాధ్యుడైన తమ సి.ఎం ను మార్చకుండా బిజెపి, మోడీ వెనకేసుకొచ్చారు. గుజరాత్‌లో ఆరేళ్ల బాలికపై స్కూలు హెడ్ మాస్టర్ లైంగికంగా హింసించి హత్య చేశాడు. మహారాష్ట్రలో ఇద్దరు విద్యార్థినులపై లైంగిక దాడి జరిగింది. 'బేటీ పఢావ్ బేటీ బచావ్' అంటే ఇదేనా? స్త్రీలకు ఎటువంటి విలువ లేదని చెప్పే సనాతన, మనువాదుల ఏలుబడిలో మహిళలకు రక్షణ ఉంటుందా? వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 30 వేల మంది మహిళలు, పిల్లలు అదృశ్యమయ్యారని బాధపడ్డ జనసేనాని, తాను పాలనలోకొచ్చాక ఆ విషయాన్ని మర్చిపోవడానికి, ప్రస్తుతం రాష్ట్రంలో స్త్రీలపై జరుగుతున్న దుర్మార్గాలపై మౌనం బిజెపి సనాతన ధర్మాన్ని భుజానేసుకున్నందుకేనేమో! ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు చరిస్తారన్నది ఒక శ్లోకం. పూజించటం మాటేమోగాని స్త్రీలను బతకనివ్వని చెరబట్టే విపత్కర రోజులు దాపురించాయి. మహిళలకు రక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రభుత్వాలకు ఆ బాధ్యత తెలియజెప్పేందుకు ఉద్యమాలే శరణ్యం.'బేటీ బచావో' అనే నినాదాన్ని అపహాస్యం చేసేలా దేశంలో మహిళలు, బాలికల మీద అత్యాచారాలు, హత్యలు వేగంగా పెరిగి పోతున్నాయి. చాలా సందర్భాల్లో బాధితులు ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారినే వేధించడం, బలాత్కరించటం, హత్య చేయడం కూడా జరుగుతున్నది. భారత దేశంలో ఇప్పుడు రోజుకు 86 అత్యాచారాలు, గంటకు 49కి పైగా నేరాలు జరుగుతున్నాయి. ఇవి ప్రధానంగా బిజెపి పాలనలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నాయి. టి.ఎం.సి పాలనలోని బెంగాల్‌లో కూడా మహిళల పైన, పిల్లలపైన భయంకరమైన అత్యాచారాలు సంభవించాయి. కర్ణాటకలో బిజెపి కూటమికి చెందిన బలమైన ఒక రాజకీయ పార్టీ ఎంపీ (తర్వాత లోక్‌సభ ఎన్నికలలో ఓడిపోయాడు) వందలాది మంది మహిళల పైన అత్యాచారాలు చేయడమే కాక వాటిని చిత్రీకరించి వేధిస్తున్నట్లు బయటపడింది. బలైన వారిలో అనేకమంది ఆయన పార్టీకి చెందిన వారే. ఇలాంటి ఘటనలపైన అక్కడక్కడ నిరసనలు కొనసాగుతున్నాయి కానీ వాటి ప్రభావం పెద్దగా వుండటం లేదు. పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్‌పై అమానుష అత్యాచారం, హత్యకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన నిరసన ఉద్యమం ఒక్కటే ఇందుకు మినహాయింపుగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు ప్రారంభించిన నిరసనకు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో వేలాది మంది స్త్రీ,పురుషుల మద్దతు లభించింది. దారుణాన్ని అడ్డుకోవడంలోనూ విఫలమవటమే కాక తర్వాత నేరస్తులను కాపాడడానికి కూడా సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వ పాత్రను ఈ నిరసన ఉద్యమం ఎండగట్టింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రజ్వరిల్లిన ఈ మహా నిరసన నుంచి మన కామ్రేడ్లు నేర్చుకోదగిన అనేక పాఠాలు ఉన్నాయి. అన్ని చోట్లా కూడా కొన్ని ఉమ్మడి అంశాలు కనిపిస్తాయి. అత్యధిక చోట్ల ఇలాంటి ఘటనలలో పోలీసులు చేయవలసింది చేయకపోగా బాధితురాలు, కుటుంబ సభ్యుల ఫిర్యాదులను పూర్తిగా పెడచెవిన పెడుతున్నారు. దాంతో దుండగులు మరింత చెలరేగిపోయి వేధింపులకు దిగడం అత్యాచారాలకు తెగబడడం కూడా జరుగుతున్నది. ఇలాంటి సందర్భాల్లో మరో ఉమ్మడి లక్షణం ఏమంటే నేరస్థులు పాలక పార్టీకి చెందిన వారైతే రక్షణ కల్పించడం, చర్య తీసుకోకుండా వదిలివేయటం జరుగుతుంది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇది సర్వసాధారణ వ్యవహారంగా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఒక మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన బిజెపి ఎమ్మెల్యేని అరెస్ట్ చేయడానికి హైకోర్టు, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. పదేపదే బెయిల్ ఇప్పించడమే కాక శిక్ష నుండి మినహాయింపు కల్పించి విడుదల చేయటం చూశాం. అనేకమంది అమ్మాయిలపై అత్యాచారానికి, హత్యలకు పాల్పడిన బాబా రామ్ రహీంను హర్యానా ప్రభుత్వం పదేపదే బెయిల్‌పై విడుదల చేస్తూ హిందీ రాష్ట్రాల ఎన్నికలలో బిజెపికి ప్రచారం చేసేందుకు ఉపయోగించు కుంటున్నది. చాలా సందర్భాల్లో ఇలాంటి ఘటనలను బయటకి తీసుకు రావడంలో ముఖ్య పాత్ర వహించే మీడియా కూడా తప్పు చేస్తుంటుంది.

# ఫలించిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ కృషి

### - పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల నిరాకరణ

### అభినందనీయం- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త అంజిరెడ్డి



**హైదరాబాద్, జూన్ 30, (తెలంగాణ దిశ) :** పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు ఇవ్వలేమని పర్యావరణ మంత్రిత్వ శాఖ (ఈఏసీ) కమిటీ తేల్చి చెప్పడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొత్త అంజిరెడ్డి అన్నారు. ఏపీ ప్రభుత్వ అనుమతుల ప్రతిపాదనలను నిర్ద్వందంగా తిరస్కరించిందన్నారు. గత జనవరి నుంచి ఇప్పటి వరకు అనేక సార్లు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్రానికి లేఖలు రాయడం, స్వయంగా కలిసి వినతి పత్రాలు ఇవ్వడాన్ని పరిగణలోకి తీసుకున్న కమిటీ ఏపీ ప్రతిపాదనలను తిరస్కరించిందన్నారు. ఇది తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లు సాధించిన విజయమన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ సైతం అభ్యంతరం వ్యక్తం చేసిందన్నారు. కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల మదింపు కమిటీ(ఈఏసి) పోలవరం -బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర నిపుణుల కమిటీ స్పష్టం చేసిందన్నారు. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ తెలిపిందన్నారు. అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్పూట్ ట్రిబ్యునల్(జిడబ్ల్యూడిటి) అవార్డు పరిశీలించాల్సి ఉందని స్పష్టం చేసిందన్నారు. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించడం అత్యవసరమని కమిటీ అభిప్రాయ పడిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# యూపీఐ యూజర్లకు అలెర్ట్..!

### ఈ మొబైల్ నంబర్స్ బ్యాంకు, యూపీఐ సేవలు బంద్..!




ఇటీవల కాలంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం భారీగా పెరిగింది. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరూ డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు. చిన్న మొత్తం నుంచి పెద్ద మొత్తంలో యూపీఐ ద్వారానే లావాదేవీలు జరుపుతున్నారు. గూగుల్‌పే, ఫోన్ పే, పేటీఎం తదితర యాప్స్ సహాయంతో డిజిటల్ పేమెంట్స్ చేస్తున్నారు. తాజాగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాన్ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. బ్యాంకులు డిస్‌కనెక్ట్ చేసిన.. లేదంటే సరెండర్ చేసిన మొబైల్ నంబర్‌లను మార్చి 31 వరకు తొలగించాలని యాప్‌లను ఆదేశించింది.

వాస్తవానికి ఒక మొబైల్ నంబర్‌ను వరుసగా 90 రోజుల పాటు వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్.. కనీసం డేటా కోసం ఉపయోగించకపోయినా ఆ నంబర్‌ను మొబైల్ కంపెనీలు డీయాక్టివ్ చేస్తాయి. ఆయా నంబర్లను ఇతరులకు కేటాయిస్తాయి. అలాంటి నంబర్ల వారంతా బ్యాంక్, ఇతర ఆర్థిక లావాదేవీల కోసం లింక్ చేసిన సమయంలో సమస్యలు ఎదురవుతాయి.

ఈ క్రమంలో అలాంటి బ్యాంకు ఖాతాలను తొలగించే పని ఏప్రిల్ ఒకటి నుంచి ప్రతివారం జరుగనున్నది. ఈ మేరకు కొత్త మార్గదర్శకాలను తీసుకువచ్చింది. మార్గదర్శకాల మేరకు బ్యాంకులు డీయాక్టివేట్ అయినా, సరెండర్ చేసిన నంబర్లను ఎప్పటికప్పుడు తొలగిస్తూ.. జాబితాను క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాల్సిందేనని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది.

గతేడాది జులా 16న స్టీరింగ్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలను అనుగుణంగా కొత్తగా మార్గదర్శకాలు విడుదల చేసింది. బ్యాంకులు మొబైల్ నంబర్ల గురించి తెలుసుకునేందుకు డిజిటల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. మార్చి 31 నాటికి బ్యాంకులతో పాటు యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లు సైతం మార్గదర్శకాలు పాటించాల్సిందేనని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. ఏప్రిల్ ఒకటి నుంచి వివరణాత్మక నివేదికలు పంచుకోవాల్సిందేనని చెప్పింది.

అలాగే అప్‌డేట్ చేసిన మొబైల్ నంబర్ స్టిసమ్‌ని ఉపయోగించి.. నిర్వహించిన లావాదేవీల సంఖ్యను పేర్కొనాలని పేర్కొంది. ఎన్‌పీసీఐ చర్యతో సమస్యలు తగ్గుతాయని భావిస్తున్నారు. వాస్తవానికి యూపీఐ కోసం మొబైల్ నంబర్ తప్పనిసరి. గతంలో యూపీఐకి లింక్ చేసిన నంబర్లను ఉపయోగించి ప్రస్తుతం చాలామంది లావాదేవీలు జరుపుతున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి అలా చేయడం కుదరదు. తప్పనిసరిగా యాక్టివ్‌లో ఉన్న నంబర్ మాత్రమే బ్యాంకులు పరిగణలోకి తీసుకుంటాయి. యాక్టివ్‌లో లేని నంబర్ల యూపీఐలను డీయాక్టివేట్ కానున్నాయి. మీకు తప్పనిసరిగా యూపీఐ సేవలు కావాలంటే ఆయా మొబైల్ నంబర్లను తప్పనిసరిగా రీచార్జ్ చేయాల్సిందే. లేకపోతే ఇబ్బందులు తప్పవు.

# వైసీపీకి రానున్నదంతా గడ్డుకాలమే..!

**విజయవాడ,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్ లో వైసీపీకి రానున్న కాలమంతా గడ్డుకాలమే. ఎందుకంటే ఇప్పటికే అనేక విషయాలపై విచారణ ప్రారంభించిన ప్రస్తుత ప్రభుత్వం అన్ని విభాగాల్లో జరిగిన అవినీతిపై లోతైన దర్యాప్తు చేయనుంది. అయితే ఆధారాలను స్పష్టంగా సేకరించిన తర్వాత మాత్రమే కేసులు నమోదు చేయనున్నారు. న్యాయస్థానాల్లో వీగిపోకుండా పకడ్బందీగా అగ్రనేతల మెడ చుట్టూ కేసుల ఉచ్చు బిగుసుకునే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వంలో అనుసరించిన లిక్కర్ అమ్మకాలపైనే ఈ ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. లిక్కర్ స్కామ్ లో నిందితులను వరసగా అరెస్ట్ లు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే ఒక ప్రణాళిక ప్రకారం పోలీసు ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించనున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ అమ్మకాలను ప్రభుత్వమే జరిపింది. నాసిరకం మద్యాన్ని అధిక ధరకు విక్రయించడం, డిజిటల్ పేమెంట్స్ కు అంగీకరించకపోవడం వంటి అంశాలు ఈ విచారణలో కీలకంగా మారనున్నాయి. ప్రయివేటు సిబ్బందిని లిక్కర్ దుకాణాల్లో నియమించి జరిపిన అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తం ఎటు వెళ్లిందన్న దానిపై ఇప్పటికే ఆరా తీస్తున్నారు. ఈ కేసులో ప్రధానంగా ఇటీవల మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేరును కూడా బయటపెట్టారు. ఆయనలే లిక్కర్ వ్యాపారంలో కీలకంగా వ్యవహరించారని సాయిరెడ్డి ఆరోపించారు. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కీలక పాత్ర పోషించారంటూ సాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఇప్పుడు ఈ ఫైలు వేగంగా ముందుకు కదులుతుంది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి గత ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేశారు. అతనే ప్రధాన సూత్రధారి అంటూ సాయిరెడ్డి చేసిన కామెంట్స్ కోణంలో అధికారులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. తెర వెనక ఉండి ఆయనే అంతా నడిపించారని, లిక్కర్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఎక్కడకు వెళ్లాయన్నది కసిరెడ్డిని విచారిస్తే ఖచ్చితంగా తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో వైసీపీ అగ్రనేతల ప్రమేయం ఉండే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వ పెద్దలు కొంత ఆలస్యమయి నా పకడ్బందీగా కేసును రూపొందించాలని ఆదేశాలు జరీ చేసినట్లు సమాచారం. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి విదేశాల్లోనూ లిక్కర్ షాపులను నడిపిన అనుభవం ఉందని తెలియడంతో ఆయన గత ప్రభుత్వంలో ఈ స్కాంలో కీలకంగా వ్యవహరించారంటున్నారు. నాటి ముఖ్య మంత్రి వైఎస్ జగన్ కు అత్యంత దగ్గరని, ఆప్తుడని కూడా గుర్తించారు. ఈ కోణంలోనే దర్యాప్తు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. విచారణ చేస్తున్న అధికారులు భావిస్తున్నారు. కసిరెడ్డి కోసం ఇప్పటికే వేట ప్రారంభమయిందని చెబుతున్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు, ప్రింటర్ పంపిణీ



**కుత్బుల్లాపూర్, జూన్ 30, (తెలంగాణ దిశ) :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ విద్యార్థులకు సోమవారం పుస్తకాలు, ప్రింటర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడుల అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు సహకరిస్తున్న గణేష్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలో శిధిలావస్థలో ఉన్న ఎంఈఓ ఆఫీస్ కోసం మంజూరైన రూ. 54 లక్షలతో భవనం పునర్నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూన రాఘవేందర్ గౌడ్, బుచ్చి రెడ్డి, మండల విద్యాధికారి జెమిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత కుమారి, శ్రీహరి, యాదగిరి, శివ, కృష్ణ ప్రసాద్, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## రైల్వే టెర్మినల్ లో ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి కృషి:ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**చర్లపల్లి, జూన్ 30, (తెలంగాణ దిశ) :**చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్లాట్ ఫార్మ్ పై షెడ్ల నిర్మాణం జరగకపోవడం మూలంగా ప్రయాణికులు ఎండకి ఎండుతూ వానకు తడుస్తూ అవస్థలు పడుతున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చర్లపల్లి రైల్వే టర్మినల్ ను సందర్శించి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నత్త నడకన జరుగుతున్న షెడ్ల నిర్మాణం తదితర సమస్యలపై చర్యల నిమిత్తం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి నాయకులు నేమురి మహేష్ గౌడ్, దప్పు గిరిబాబు, జోనుల ప్రభాకర్ రెడ్డి, బొడిగ రాజు గౌడ్, జోర్ల వేణుగోపాల్ రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి కడియాల బాబు తదితరులు పాల్గొన్నారు.


## పైప్ లైన్ రోడ్ విస్తరణ పనులను నిలిపి వేయాలి



**కుత్బుల్లాపూర్, జూన్ 30, (తెలంగాణ దిశ) :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల డివిజన్ పైప్ లైన్ రోడ్ శ్రీ లక్ష్మిగంగా ఎన్ క్లేవ్ లో రోడ్డు విస్తరణ పనులను నిలిపివేయాలని శ్రీ లక్ష్మిగంగా ఎన్ క్లేవ్ కాలనీవాసులు సోమారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ కలసి విన్నవించుకున్నారు. గత 20 సంవత్సరాల నుండి 350 కుటుంబాలు స్థానికంగా నివాసం ఉంటున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం 40 ఫీట్ల రోడ్డు ఉందని, ఇప్పుడు రోడ్డు విస్తరణలో భాగంగా 60 ఫీట్ల రోడ్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు మార్కింగ్ చేసారని, ఎలాగైనా కుటుంబాలకు ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వారందరి కుటుంబాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బాలప్ప, బండి శ్రీనివాస్ గౌడ్, కాలనీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమణ రెడ్డి, ఉపాధ్యక్షులు పెంటరెడ్డి, సెక్రెటరీ కృష్ణయ్య, సభ్యులు కౌశిక్, సురేందర్ ప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ట్రూ డౌన్ అంటే అధిక వసూళ్లలో మిగులే..!

**అమరావతి,తెలంగాణ దిశ:**ఎపి ట్రాన్స్‌కో నాల్గవ నియంత్రణ కాలానికి (2019-20 నుండి 2023-24 వరకు) రూ.1059.75 కోట్ల మేరకు ట్రూ డౌన్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేసింది. దీనర్థం ఆ మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి చెల్లించడానికి అనుమతివ్వాలని కోరడం. ఈ పిటిషన్ దాఖలు కాగానే ఇదేదో టిడిపి కూటమి ఘనకార్యమన్నట్లుగా ప్రచారం ప్రారంభమైంది. అయితే, వాస్తవం భిన్నం! ట్రాన్స్‌కోకు ఆదాయంలో మిగులు ఏర్పడితే ఈ పరిస్థితి వస్తుంది. ఆ మిగులు ఎలా వచ్చిందన్నదే కీలకం. మన రాష్ట్రంలో ప్రజల నుండి చేసిన అధిక వసూళ్లలో మిగుళ్లు ఏర్పడటం, చేయవలసిన చోట అవసరమైన ఖర్చును చేయకపోవడం ఈ పరిస్థితికి కారణం. కమిషన్ వార్షిక ప్రాతిపదికపై అనుమతిం చిన వ్యయం, ఆదాయాలలో వచ్చిన తేడాల ఆధారంగా ట్రూ అప్ లేదా ట్రూ డౌన్ చేయాల్సిన మొత్తాలు తేలతాయి. ట్రాన్స్‌కోకు ఆదాయంలో లోటు వస్తే ట్రూ అప్ కింద వినియోగదారుల నుండి వసూలు చేసుకునేందుకు కమిషన్ అనుమతిస్తుంది. ఆదాయంలో మిగులు తేలితే ట్రూడౌన్ కింద ఆ మొత్తాన్ని వినియోగదారులకు డిస్కాంల ద్వారా తిరిగి చెల్లించాలని కమిషన్ ఆదేశిస్తుంది. 2వ, 3వ నియంత్రణ కాలాలకు (2009-2014, 2014-2019) కూడా ఎపి ట్రాన్స్‌కో అదనపు ఆదాయాలను ట్రూ డౌన్ చేసి పెట్టుబడులు, ఇతర వ్యయాలను అధికంగా చూపడం, వాటి ఆధారంగా ప్రసార



ఛార్జీలను న్యాయంగా ఉండాల్సిన దాని కన్నా ఎక్కువగా నిర్ణయించి, వసూలు చేయటం వల్ల అదనపు ఆదాయాన్ని ట్రాన్స్‌కో పొందింది. అదనపు ఛార్జీలను సమర్థించుకున్నది ఇలా: 2019-20 నుండి 2023-24 మధ్య కాలానికి రూ.50,341.44 కోట్ల ఆర్ఆర్‌బిను నిర్ణయించారు. ఆర్ఆర్‌బి అంటే రెగ్యుటేడ రేట్ బేస్. ఇది ట్రాన్స్‌కో విద్యుత్ ప్రసార వ్యవస్థలో వినియోగంలో ఉన్న ఆస్తుల విలువ. ఇంత విలువ కల ఆస్తులను ఉపయోగించి విద్యుత్ ప్రసారం చేసినందుకు అయ్యే ఖర్చును ముందుగానే లెక్కించి వినియోగదారుల నుండి ముందే వసూలు చేసేశారు. కానీ, వాస్తవంగా ట్రాన్స్‌కో 2023-2024 నాటికి రూ.37,863.98 కోట్ల విలువగల ఆర్ఆర్‌బిని మాత్రమే సాధించగలిగింది. అందువల్ల, తగ్గిన ఈ పెట్టుబడి ఆధారంగా విద్యుత్ ధరలను తగ్గించాలి. కానీ, ఇప్పటికే రూ.50,341.44 కోట్ల ప్రాతిపదికన వినియోగదారుల వద్ద వసూలు చేసేశారు. కనుక, దానిని రూ.37,863.98 కోట్ల ప్రాతిపదికన తగ్గించి లెక్కించాలి. వినియోగదారుల దగ్గర అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వెనక్కు ఇవ్వాలి. ఇదే, ట్రూ డౌన్. అంటే ట్రాన్స్‌కో సామర్థ్యం పెరిగినందు వల్ల వచ్చిన ఫలితం కాదిది! నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరడంలో వెనుకబడినందు వల్ల వచ్చిందిది! దీనిని టిడిపి సర్కారు ఘనతగా ఎవరన్నా ప్రచారం చేయదల్చుకుంటే అంతకన్నా తెలివితక్కువ మరొకటి ఉండబోదు. ట్రాన్స్‌కోనే అనుచిత ప్రయోజనం పొం దింది. వినియోగదారుల నుండి ఐదేళ్లపాటు, ప్రతి నెలా అదనంగా వసూలు చేసిన సొమ్ము ట్రాన్స్‌కో తన అవసరాలకు వాడుకుంటున్నది. తిరిగి, చెల్లించాల్సిన పరిస్థితి వస్తే మాత్రం ముందు రెగ్యులేటరీ కమిషన్‌కు నివేదిస్తుంది. ఆ కమిషన్ మరో ఏడాది తరువాత నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. అంటే ఆరేళ్లపాటు ట్రాన్స్‌కో ఈ మొత్తాన్ని వాడుకుంటుంది.

తిరిగి చెల్లించాల్సి వచ్చేసరికి, ఆమొత్తాన్ని ట్రాన్స్‌కో డిస్కమ్‌ల ఖాతల్లోకి జమ చేస్తుంది. డిస్కమ్‌లు వినియోగదారుల నుండి నెలనెలా వసూలు చేయవలసిన ట్రూఅప్ ఛార్జీలను ఒకేసారి పొందనట్లు జమచేసుకుంటాయి. అప్పుడు ట్రూ డౌన్ ద్వారా వినియోగదారుడికి తిరిగి రావాల్సిన మొత్తం రాదు. ఒకవేళ ఛార్జీలను పెంచరాదని ఏదైనా సంవత్సరంలో నిర్ణయిస్తే అప్పుడు కూడా ప్రభుత్వం నుండి రావాల్సిన సబ్సిడీని తగ్గిస్తారు తప్ప వినియోగదారునికి తిరిగి చెల్లించరు.

# ఆకాశమే హద్దుగా పెరుగుతున్న ధర..!

బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. పసిడి ధర ఈరోజు సరికొత్త రికార్డును తాకింది. ముఖ్యంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 80,780 పలికింది. ఇంకా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 73,800 పలికింది. బంగారం ధరలు పెరగడానికి ప్రధానంగా అమెరికాలో పసిడి ధర భారీగా పెరగడం ఒక కారణంగా చెప్పవచ్చు. ఈరోజు అమెరికాలో ఒక ఔన్స్ (31 గ్రాములు) బంగారం ధర 2750 డాలర్లు పలికింది. దీంతో బంగారం ధర విపరీతంగా పెరిగింది. బంగారం ధరలు ప్రస్తుతం ఆల్ టైం రికార్డ్ స్థాయి వద్ద ఉన్నాయి. దీనికి ప్రధానంగా అంతర్జాతీయంగా ఉన్న పరిస్థితులు కారణంగా చెప్పవచ్చు. ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధ వాతావరణానికి తోడు, చైనా – తైవాన్ మధ్య కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ప్రపంచ వాణిజ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగారం ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వారికి చాలా ఇబ్బందిగానే చెప్పాలి. పసిడి ధరలు భారీగా పెరగడంతో ప్రస్తుతం రాబోయే ధన త్రయోదశి, దీపావళి సందర్భంగా ఆభరణాలు కొనుగోలు చేసే వారికి చాలా ఇబ్బంది అని చెప్పాలి. బంగారం ధర ఎంత వేగంగా పెరిగిందో మనం చూడవచ్చు ఈ సంవత్సరం ప్రారంభం నుంచి మనం గమనించినట్లయితే బంగారం ధర దాదాపు 12 వేల



రూపాయలు పెరిగింది. బంగారం ధర జూలై నెలలో 67 వేల రూపాయలు మాత్రమే ఉంది. కానీ ప్రస్తుతం 80000 దాటిపోయింది. దీన్ని బట్టి బంగారం ధర దాదాపు 13 వేల రూపాయలు ఈ మూడు నెలల్లోనే పెరిగింది. మీరు బంగారం కొనుగోలు చేస్తున్నట్లయితే కచ్చితంగా బరువు విషయంలోనూ నాణ్యత విషయంలోనూ ఎట్టి పరిస్థితులను కాంప్రమైజ్ కావద్దు. ఒక మిల్లీగ్రామ్ తేడా వచ్చినా గాని మీరు పెద్ద మొత్తంలో నష్టపోయే ప్రమాదం ఉంది. ఇక బంగారంపై పెట్టుబడి పెట్టాలనుకుంటే మాత్రం కేంద్ర ప్రభుత్వం జారీ చేసే సావరిన్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడి పెడితే మంచిది.

# భయపెట్టే పచ్చదనం

పచ్చదనం కంటికి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. భూగోళాన్ని రక్షిస్తుంది. అందుకే పెద్దఎత్తున చెట్లను పెంచాలని పర్యావరణవేత్తలు చెవిన ఇల్లు కట్టుకుని చెబుతుంటారు. కానీ, అంటార్కిటికా దీనికి భిన్నం. అక్కడ పెరుగుతున్న పచ్చదనం శాస్త్రవేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. భూగోళం భవిత ఏమిటన్న భయాన్ని కలిగిస్తోంది. ఏ వాతావరణ మార్పులను అడ్డుకోవడానికి చెట్లను పెంచాలని చెబుతారో, ఆ మార్పుల కారణంగానే అంటార్కిటికాలో పచ్చదనం పెరుగుతుండటమే దీనికి కారణం. దుప్పటి పరిచినట్టు కిలోమీటర్ల తరబడి తెల్లటి మంచు తప్ప మరేమీ కనపడని హిమఖండం అంటార్కిటికా వాతావరణ మార్పుల కారణంగా క్రమేణా వేడెక్కుతుండటంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. ఉష్ణతాపానికి తరతరాలుగా ఇక్కడ పేరుకుపోయిన మంచు వేగంగా కరుగుతోంది. ఎంతగా అంటే, ఎప్పుడూ మైనస్ డిగ్రీలలో ఉండాల్సిన ఉష్ణోగ్రతలు వేసవిలో పది డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. వేడి గాలులు కూడా వీస్తున్నాయి. భూగోళం మీద ఉష్ణోగ్రత పెరుగుదల రేటు అత్యధికంగా అంటార్కిటికాలోనే నమోదవుతున్నట్లు శాస్త్రవేత్తలు తేల్చారు. ఫలితంగా గత ఐదు సంవత్సరాల కాలంలోనే నాలుగు లక్షల మీటర్ల మేర పచ్చదనం విస్తరించింది. హిమానీ నదాలు కరుగుతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే సముద్రమట్టాలు పెరిగి భూగోళం ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇదొక్కటే కాదు, ప్రపంచంలోనే అతి పెద్ద ఎడారి సహారాను ఇటీవల వరదలు ముంచెత్తడం కూడా ఇటువంటి ఆందోళన కలిగించే పరిణామమే! సెప్టెంబర్ నెలలో చోటుచేసుకున్న సహారా వర్షాలు, వరదలు చర్చనీయాంశంగా మారాయి. యూనివర్శిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనం ప్రకారం తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులతో పాటు కలవరపరిచే వరదలు కూడా సహారా భవిష్యత్తులో భాగం కానున్నాయి. ఇసుక ప్రవాహాలకూ దారి తీసే ప్రమాదం ఉందని ఆ అధ్యయనం హెచ్చరించింది. అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం రూపొందించిన 2024 స్టేట్ ఆఫ్ ది క్లైమేట్ రిపోర్టు ముంచుకొస్తున్న సంక్షోభం గురించి చేసిన హెచ్చరికను కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. ఉద్గారాల నియంత్రణలో వివిధ దేశాల ప్రభుత్వాలు తమ లక్ష్యాలను చేరుకున్నప్పటికీ ప్రపంచ ఉష్ణోగ్రతల స్థాయి 2.7 సెల్సియస్ డిగ్రీలకు పెరిగే ప్రమాదం ఉందని ఈ నివేదిక హెచ్చరించింది. సౌర, పవన ఇంధనాల వినియోగం పెరుగుతున్నప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా శిలాజ ఇంధన వినియోగం



తగ్గకపోగా ఏటికేడాది మరింతగా పెరుగుతోందని ఈ నివేదికలో శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.మన దేశంమీద కూడా ఈ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. గత వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలను చవి చూడగా, వర్షాకాలంలో భారీ వరదలు సృష్టించిన నష్టాలతో దేశం అతలాకుతలమైంది. కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, అస్సాంలతో పాటు మన రాష్ట్రానికి కూడా నైరుతి రుతుపవనాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వరదల కారణంగా తరచూ ముంపునకు గురయ్యే ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి మహానగరాల సరసన మన విజయవాడ కూడా చేరింది. అధికారిక లెక్కల ప్రకారం గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రుతపవనాల సంబంధిత విపత్తుల వల్ల 1,400 మంది అధికంగా ప్రాణాలు కోల్పోయారు. ఒక్క హిమాచల్ ప్రదేశ్‌లోనే 200 మంది మరణించారు. ఆస్తి నష్టం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. నివారణ చర్యల కంటే, విపత్తు అనంతర ఉపశమన చర్యలపైనే ప్రభుత్వాలు అధికంగా దృష్టి సారించడం ఈ పరిస్థితికి కారణం. వాతావరణ మార్పుల ప్రభావం అనివార్యంగా మారిన పరిస్థితుల్లో ప్రోయాక్టివ్ విధానాల అమలుకు ప్రభుత్వాలు సిద్ధం కావాల్సి ఉంది. ఈ దిశలో అవసరమైన సమగ్ర చర్యలను దేశ వ్యాప్తంగా చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. నవంబర్ నెలలో ఐక్యరాజ్యసమితి వార్షిక వాతావరణ చర్చలు (కాప్–29) అజర్‌బైజాన్‌లో జరగనున్నాయి. ఈ సమావేశంలోనైనా మన దేశం స్వతంత్ర గళం వినిపించాలి. ఉద్గారాల విషాన్ని వెదజల్లడంపై సంపన్న దేశాలను నిలదీయాలి. అటువంటి స్వతంత్ర వైఖరే వాతావరణ మార్పుల విపత్తుల నుండి మన దేశాన్ని, అంటార్కిటికా వంటి మంచు ఖండాల్ని, మొత్తం భూగోళాన్ని కాపాడుతుంది.

# ఎలన్ మస్క్‌కు న్యాయశాఖ వార్నింగ్

న్యూయార్క్: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు మొదలయ్యాయి. ప్రస్తుతం ముందస్తు ఓటింగ్ జరుగుతోంది. దేశాధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. అయితే రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ కు .. బిలియనీర్ ఎలన్ మస్క్ మద్దతు తెలిపారు. ఇక మస్క్‌కు చెందిన ప్రచార సంస్థ అమెరికా ప్యాక్.. ఓటర్లకు ప్రైజ్‌మనీ ఆఫర్ ఇస్తున్నది. ఈ నేపథ్యంలో అమెరికా న్యాయశాఖ వార్నింగ్ ఇచ్చింది. ఓటర్లకు ప్రైజ్‌మనీ ఇవ్వడం అంటే ఫెడరల్ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని న్యాయశాఖ తన లేఖలో పేర్కొన్నది. మస్క్ ప్రకటించిన పది లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ ప్రకారం..ఏడు స్వింగ్ రాష్ట్రాల్లో ఓటర్లు ఓ పిటీషన్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది. ప్రతి రోజు ఎన్నికల తేదీ వరకు ఓ విజేతను ప్రకటిస్తారు. ర్యాండమ్‌గా ఓ వ్యక్తిని ఎంపిక చేసి, అతని మిలియన్ డాలర్ ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. పెన్సిల్వేనియాలో అక్టోబర్ 19వ తేదీన టౌన్‌హాల్‌లో జరిగిన ఈవెంట్‌లో ఓ మహిళ ఓటర్‌కు లాటరీ తరహాలోని జంబో చెక్‌ను అందజేశారు. పిటీషన్‌పై సంతకం చేయడానికి ఆ పార్టీతో సంబంధం లేదని, ఓటు వేయకున్నా పిటీషన్‌పై సంతకం చేయవచ్చు అని ఇటీవల మస్క్ అన్నారు. జార్జియా, నెవడా, ఆరిజోనా, మిచిగన్, విస్కిన్‌సన్, నార్త్ కరోలినా రాష్ట్రాల్లో అమెరికా ప్యాక్ సంస్థ ఓటర్ల



నుంచి పిటీషన్లను స్వీకరిస్తున్నది.

పిటీషన్‌పై సంతకం చేసి మరో ఓటర్‌ను రిఫర్ చేస్తే వారికి 47 డాలర్లు ఇవ్వనున్నారు. పెన్సిల్వేనియాలో ఒక సంతకానికి 100 డాలర్లు ఇస్తున్నారు. పిటీషన్‌పై సంతకం చేయడం ద్వారా అమెరికా రాజ్యాంగంలోని ఫస్ట్, సెకండ్ సవరణలకు మద్దతు ఇస్తున్నట్లు అవుతుందని అమెరికా ప్యాక్ సంస్థ చెప్పింది.

# శామ్‌సంగ్ కార్మికుల చారిత్రాత్మక విజయం

తమిళనాడు లోని కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూర్ లోని బహుళజాతి సంస్థ శామ్‌సంగ్ కంపెనీలో 37 రోజుల పాటు జరిగిన చారిత్రాత్మక సమ్మెలో కార్మికులు అద్భుత విజయం సాధించారు. వేతనాలు పెంచాలని, యూనియన్‌ను గుర్తించాలని ఈ సమ్మెకు సిఐటియు నాయకత్వం వహించింది. సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి, పోరాడుతున్న కార్మికులను లోబరుచుకోవటానికి, బెదిరించటానికి యాజమాన్యం విశ్వప్రయత్నాలు చేసింది. ప్రభుత్వం, పోలీసులు ప్రత్యక్షంగా యాజమాన్యానికి మద్దతు ప్రకటించారు. సమ్మెలో ఉన్న కార్మికులు చెక్కు చెదరని విశ్వాసంతో, సడలని పట్టుదలతో పోరాటాన్ని కొనసాగించటంతో 'శామ్‌సంగ్ యాజమాన్యం, తమిళనాడు ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చాయి.

కార్మికులతో చర్చలు జరిపి అన్ని డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని, సమ్మెలో ఉన్న ఏ ఒక్క కార్మికుణ్ణి తొలగించబోమని, కక్ష సాధింపులకు పూనుకోబోమని రాతపూర్వక సమాధానం అందించాయి. దీంతో కార్మికులు సమ్మెను విరమించి అక్టోబర్ 17వ తేదీ నుంచి విధులకు హాజరయ్యారు. దక్షిణ కొరియాకు చెందిన శామ్‌సంగ్ కంపెనీకి భారతదేశంలో ఉన్న రెండు ప్లాంట్లలో ఒకటి తమిళనాడు కాంచీపురం జిల్లా శ్రీపెరంబదూరు సమీపంలోని శృంగేరిచత్రంలో వుండగా, రెండవది ఢిల్లీ సమీపంలోని నోయిడాలో వున్నది. శామ్‌సంగ్ ఆదాయం రూ. 5 లక్షల కోట్లు. ప్రపంచమంతటా ఏడాదికి రూ. 4 లక్షల కోట్ల ఆదాయం వస్తే భారతదేశం నుండి రూ. లక్ష కోట్లు వస్తుంది.

30 శాతం వస్తువులు భారతదేశంలోనే ఉత్పత్తి అవుతాయి. ఇక్కడి నుంచి 15 దేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. ఇక్కడ అత్యంత అధునాతన ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, టీవీలు ఉత్పత్తి అవుతాయి. 1700 మంది పర్మినెంట్, 3 వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఇందులో పని చేస్తారు.

మొత్తం 4700 మంది 17 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. అయితే ఇక్కడ ఏ ట్రేడ్ యూనియన్ లేదు.

# కెనడా ప్రధాని ట్రూడోకు సొంత పార్టీ ఎంపీలు అల్టిమేటం..

ఖలిస్థాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యతో భారత్ – కెనడా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ హత్యలో భారత్ ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాన జస్టిన్ ట్రూడో నే స్వయంగా ఆరోపణలు చేయడం సంచలనం సృష్టించింది. ట్రూడో ఆరోపణలతో రెండేళ్లుగా భారత్, కెనడా మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే ట్రూడో ఆరోపణలను మాత్రం భారత్ ఎప్పటికప్పుడు కొట్టి పారేస్తోంది. ఈ వివాదాల నేపథ్యంలో.. ఇప్పుడు కెనడా ప్రధాని చిక్కుల్లో పడినట్లు తెలుస్తోంది. కెనడా అధికార లిబరల్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు జస్టిన్ ట్రూడోకు అల్టిమేటం జారీ చేశారు. ప్రధాని పదవి నుంచి తప్పుకోవాలని లేదంటే తిరుగుబాటు చేస్తామంటూ హెచ్చరించారు. ఈ మేరకు డెడ్‌లైన్ కూడా పెట్టారు. అక్టోబర్ 28లోగా రాజీనామా చేయాలని తేల్చి చెప్పినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ట్రూడో రాజీనామా చేయాలన్న లేఖపై మొత్తం 153 మంది ఎంపీల్లో 24 మంది సంతకాలు చేసినట్లు ది గార్డియన్ తెలిపింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఓటమిని ఊహించి రాజీనామా చేయాల్సిందిగా ప్రధానిని కోరినట్లు పేర్కొంది. కాగా, వచ్చే ఏడాది అక్టోబర్‌లో కెనడా పార్లమెంట్‌కు ఎన్నికలు జరగనున్నాయి. ఇక గత ఎన్నికల్లో ప్రధాని జస్టిన్ ట్రూడో సార్థ్యంలోని లిబరల్ పార్టీ తిరుగులేని విజయం సాధించిన విషయం



తెలిసిందే. ట్రూడో వరుసగా మూడోసారి అధికారాన్ని నిలబెట్టుకున్నారు. అయితే, ఆ ఎన్నికల్లో ఆయన పార్టీ సొంతంగా పూర్తి మెజారిటీ సాధించలేకపోయింది. కరోనా నియంత్రణలో సమర్థంగా చర్యలు తీసుకున్నందుకు ప్రజలు పూర్తిస్థాయి మెజారిటీ కట్టబెడతారన్న నమ్మకంతో ట్రూడో మధ్యంతర ఎన్నికలకు వెళ్లారు. ఆయన మైనారిటీ ప్రభుత్వానికి ఎలాంటి ముప్పు లేకపోయినా 'మధ్యంతర' నిర్ణయం తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే, ఇప్పుడు నాలుగోసారి అధికారం కోసం ట్రూడో సిద్ధమవుతున్నారు.

# ఉద్యోగులు-మానసిక ఆరోగ్య ప్రాధాన్యత

'ఆరోగ్యం అంటే పూర్తిగా శారీరక, మానసిక దృఢత్వం. సామాజిక శ్రేయస్సు కలిగి ఉండటం. అంతే కానీ కేవలం వ్యాధి, బలహీనత లేకపోవటం కాదు' అని ప్రపంచ ఆరోగ్య సంస్థ మొదటి డైరెక్టర్ జనరల్, ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త, వైద్యుడు జార్జ్ బ్రోక్ చిషోల్మ్ చెప్పారు. నేటి సమాజ పరిస్థితులకు అద్దం పట్టే వాక్యమిది. చాలా మందికి శారీరక వ్యాధులకు సంబంధించిన లక్షణాలు, చికిత్సా ఎంపికలు తెలిసినప్పటికీ, వారి మానసిక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియదు.

ప్రతి వ్యక్తీ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా పటిష్టమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంచుకోగలుగుతారు. ఇది ఒక అంశమైతే, మానసిక ఆరోగ్యం ప్రధాన మానవ హక్కు. మానవ మనుగడలో, సామాజిక, ఆర్థిక, వ్యక్తిగత అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది.

ప్రపంచ జనాభాలో 60 శాతం మంది ఉద్యోగ రంగంలో ఉన్నారు. ఈ మేరకు ఉద్యోగ ప్రదేశాలలో మానసిక ఆరోగ్య ప్రమాదాలను గుర్తించి, నివారించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ అందరినీ హెచ్చరిస్తోంది. గత సంవత్సరం, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి "జాతీయ పురోగతి" కోసం యువత వారానికి 70 గంటలు పని చేయాలని సూచించారు. అమెరికాలో టెస్లా వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ మనిషి తన వృత్తిలో విజయవంతం కావడానికి వారానికి 100 గంటలు పని చేయాలని సూచించారు. కానీ దీర్ఘ కాలం విశ్రాంతి లేకుండా పని చేయటం వాస్తవానికి మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రతికూలమైనదని మానసిక శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైంది.

దానికి తార్కాణం ఈ మధ్య ఎర్నెస్ట్ యంగ్ కంపెనీలో ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్న 26 ఏళ్ల అన్నా సెబాస్టియన్ పెరైల్ పని ఒత్తిడి వలన మరణించటం దేశమంతా సంచలనం కలిగించింది. అదే విధంగా, మరో సంఘటనలో ఉద్యోగిని బ్యాంకులో పని చేస్తుండగా కుప్పకూలి మృతి చెందిన సంఘటన ఉత్తరప్రదేశ్ లక్నోలో జరిగింది. ఈ సంఘటనపై ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ తన ట్విట్టర్‌లో విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కార్పొరేటు విధానాలతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని విమర్శించారు. పని ఒత్తిడి గురించి ప్రభుత్వాలు, కంపెనీలు తీవ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నిజానికి మానవ వనరులు కోల్పోవడమనేది పూడ్చలేని లోటు. దీర్ఘకాల పని గంటలు, ఉద్యోగ సంస్థలలో అభద్రతా వాతావరణం, అణచివేత లాంటి కారణాలు ఉద్యోగుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి.

వ్యక్తిగత, జాతీయ అభివృద్ధికి మానసిక ఆరోగ్యం ప్రధానమైన, ప్రభావవంతమైన చోదక శక్తిగా నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే (ఎన్.ఎం.హెచ్.ఎస్) భావిస్తోంది. ఎన్.ఎం.హెచ్.ఎస్ 2015–16 నివేదిక ప్రకారం, భారతదేశంలో 10.6 శాతం పెద్దలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ఇతర రుగ్మతలకు, మానసిక రుగ్మతలకు చికిత్స వ్యత్యాసం 70 శాతం నుండి 92 శాతం మధ్య ఉందని సర్వే పేర్కొంది. గ్రామీణ ప్రాంతాలు (6.9 శాతం), పట్టణేతర మెట్రో ప్రాంతాలు (4.3 శాతం)తో పోలిస్తే పట్టణ మెట్రో ప్రాంతాల్లో (13.5 శాతం) మానసిక రుగ్మతల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. ఒత్తిడితో కూడిన జీవన పరిస్థితులు, ఆర్థిక అస్థిరత, ఎదిగే అవకాశాలు లేకపోవడం వల్ల పేదరికం మానసిక ఆరోగ్య ప్రమాదాన్ని ప్రభావితం చేస్తుంది. ఇవి మానసిక క్షోభను పెంచడానికి దోహదం చేస్తాయి. మానసిక ఆరోగ్యం మొత్తం శ్రేయస్సుకి ప్రాథమిక అంశం వంటిది. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం, క్షేత్ర స్థాయిలో మానసిక ఆరోగ్య సంరక్షణలో చేసిన మెరుగుదలలను వేగవంతం చేయడానికి, వాటి ప్రభావాన్ని పెంచడానికి ప్రస్తుత కార్యక్రమంలో అంతరాలను పరిష్కరించడానికి పూనుకోవాలని సర్వే నొక్కి చెప్పింది. విధానపరమైన కొన్ని ముఖ్యమైన సిఫార్సులు కింది విధంగా ఉన్నాయి.

ప్రతి లక్ష జనాభాకు 0.75 మంది సైకియాట్రిస్టుల నుంచి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణానికి అనుగుణంగా లక్ష జనాభాకు మానసిక వైద్యుల సంఖ్యను మూడుకు పెంచే ప్రయత్నాలను రెట్టింపు చేయాలి. ఎక్సలెన్స్ సెంటర్ల సేవలతో పాటు మానసిక ఆరోగ్య సంరక్షణ నిపుణులు, యూజర్లు తమ అవసరాలను అర్థం చేసుకోవడానికి సమగ్ర మార్గదర్శకాలను రూపొందించాలి. పీర్ సపోర్ట్ నెట్‌వర్క్‌లు, స్వయం సహాయక బృందాలు, కమ్యూనిటీ ఆధారిత పునరావాస కార్యక్రమాలను పెంపొందించడం మొదలైనవి మానసిక రుగ్మతల కుంగుబాటును తగ్గించడానికి, తమదనే భావనను పెంపొందించడానికి సహాయపడతాయి. నిర్ణయాలు తీసుకోవడం, సేవా ప్రణాళికలు, సలహా ప్రయత్నాలలో%ొ%మానసిక ఆరోగ్య సమస్యలతో వ్యక్తిగత అనుభవం ఉన్న వారిని భాగస్వాములను చేయడం ద్వారా మానసిక ఆరోగ్య సేవల వ్యక్తి–కేంద్రీకృత, రికవరీ ఓరియెంటేషన్‌ను మెరుగు పరచవచ్చు. మానసిక ఆరోగ్యం, పని దగ్గర సంబంధం కలిగి ఉండటం వలన సహాయక పని వాతావరణం మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ప్రయోజనం, స్థిరత్వాన్ని అందిస్తుంది.



మానసిక అనారోగ్యంతో వున్న వారికి సరైన మద్దతు లేకపోవడం వలన వారి ఆత్మవిశ్వాసం, పనిలో ఆనందం, పని సామర్థ్యం, ఉపాధి పొందే సామర్థ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. పేలవమైన మానసిక ఆరోగ్యం, కుంగుబాటు, ఆందోళన అనేవి%ొ% పని తీరు తగ్గడానికి, పనికి దూరంగా ఉంటానికి కారణమౌతాయి. సిబ్బంది టర్నోవర్‌పై ప్రభావం వేస్తాయి.

కార్యాలయంలో ఉద్యోగుల మానసిక ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవటం, అవగాహన కార్యక్రమాలు రూపొందించటం, సహేతుకమైన వసతిని, సాధారణ సహాయక సమావేశాలను నిర్వహించటం, తరచుగా విరామాలను షెడ్యూల్ చేయడం, లాంటి చర్యలు యాజమాన్యం తీసుకోవాలి.

కార్యాలయంలోని ఒత్తిడిని గుర్తించి వాటిని పరిష్కరించేందుకు యజమానులు నిర్వాహకులకు శిక్షణ అందించాలి. శిక్షణ పొందిన నిర్వాహకులు తమ బృందాలకు సమర్థవంతంగా మద్దతు ఇవ్వగలరు.

మానసిక ఆరోగ్య ప్రమాదాలను నిరోధించే విధానాలను రూపొందించడానికి, శ్రేయస్సును ప్రోత్సహించడానికి,

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చే సహాయక కార్యాలయాలను రూపొందించడానికి ప్రభుత్వాలు, యజమానులు, ప్రతినిధి సంస్థలు కలిసి పని చేయాలి. ప్రతి ఉద్యోగి తామ స్వంత శ్రేయస్సుకు మద్దతు ఇవ్వడానికి చర్యలు తీసుకోవచ్చు. ఒత్తిడిని నిర్వహించడానికి, మానసిక ఆరోగ్యంలో మార్పులను గుర్తుంచుకోవడానికి పద్ధతులను నేర్చుకోవాలి. విశ్వసనీయ స్నేహితుడు, అవసరమైతే కుటుంబ సభ్యుడు, సహోద్యోగి, సూపర్‌వైజర్, ఆరోగ్య నిపుణుల నుండి మద్దతు కోసం సంప్రదించాలి. పని ప్రదేశం ఎప్పుడు నిశ్శబ్దాన్ని ఛేదించి, ఉద్యోగులకు మద్దతు ఇచ్చే పవిత్ర క్షేత్రం అవుతుందో, మానసిక ఆరోగ్యం గురించి సంభాషణలు జరుగుతాయో, అప్పుడు ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య వారు నినదించిన "పని ప్రదేశంలో మానసిక ఆరోగ్య ప్రాధాన్యత" సందేశానికి సార్థకత చేకూరుతుంది.

### ప్రధానమంత్రి సురక్ష బీమాను

# ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**తోగుట,తెలంగాణ దిశ:**సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను ప్రజలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ మేనేజర్ జలందర్ అన్నారు. భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదే శాల మేరకు మండలంలోని చందాపూ ర్ గ్రామంలో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం భాగంగా ప్రజలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ సెక్యూ రిటీ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. సంవ త్సరానికి రూ. 20 చెల్లించి ఏడాదికి రెండు లక్షల ప్రమాద బీమా పొందడానికి అవకాశం వుందన్నా రు. 18 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు అర్హులు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన 436 సంవత్సరానికి రూ. 436 చెల్లించి రెండు లక్షల జీవిత బీమా పొందవచ్చని తెలిపారు. 18 నుండి 50 సంవత్సరాల వారు అర్హులు ఫిషింగ్ కాల్స్ ద్వారా సేవింగ్ కాల్స్ ద్వారా ఆన్లైన్ ద్వారా జరిగే ఫ్రాడ్స్ పై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి ఎలాంటి ఓటీపీలు సివివి నెంబర్లు అడిగే అవకాశం ఉండదని సూచించారు. ఎలాంటి ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే 1930 కి కాల్ చేసి తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీ సర్ భరత్ కుమార్, మాజీ సర్పంచ్ బొడ్డు నర సింహులు, ఆర్థిక అక్షరా స్యత కేంద్రం కౌన్సిలర్ ఎనుముల శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ప్రత్యేక శిబిరాలు పెట్టి ఏంలాభం?



**చీరాల,తెలంగాణ దిశ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డు ఎంతో కీలకమైంది. ఆధార్ నవీకరణకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్షల మంది ఇంకా దూరంగా ఉన్నారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు జిల్లాలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలాల్లో ఎంపీడీవోలు, పట్టణాల్లో పుర కమిషనర్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినా ఆధార్ నవీకరణ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. గంటలు తరబడి వేచి ఉన్నా.. సర్వర్ మొరాయించడంతో తిప్పలు తప్పడం లేదు. జిల్లాలోని 96 సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 64చోట్లే పని చేస్తున్నాయి. మార్పులు చేర్పులు చేయడానికి అక్కడి డిజిటల్ సహాయకులకు ప్రత్యేక శిక్షణ సైతం అందించారు. చీరాల మండలం గవినివారిపాలెంలో ఉదయం కంప్యూటర్ ఆన్ చేయగా.. సాయంత్రం 4 వరకు పని చేయకపోవడం విశేషం. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఎదురుకావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే సాంకేతిక సిబ్బంది సాయం తీసుకుని కొన్నిచోట్ల సరిచేశారు. మరికొన్ని చోట్ల మాత్రం సమస్య కొనసాగింది. తొలి రోజు అతికష్టం మీద 1170 దరఖాస్తులను పరిష్కరించినట్లు చెబుతున్నారు. రెండోరోజు గురువారం ఆన్‌లైన్ అవాంతరాలు కొనసాగడంతో ఈ సంఖ్య 633కి పడిపోయింది. జిల్లా వ్యాప్తంగా కొన్ని ఇబ్బందులు తమ దృష్టికి వచ్చినట్లు వార్డు, గ్రామ సచివాలయల జిల్లా అధికారిణి సువార్త పేర్కొన్నారు. సమస్యలు ఎదురైతే ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు.

# రెవెన్యూ అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలి : కలెక్టర్

**రాజంపేట,తెలంగాణ దిశ:**రెవెన్యూ అధికారులు తమ పనితీరు మెరుగుపరచుకొని శాఖ ప్రతిష్టను పెంచేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని స్థానిక కళాంజలి కల్యాణమండపంలో సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజంపేట డివిజన్ తహశీల్దార్‌లు, డిటిలు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు విఆర్ఓలు, విఆర్ఎలతో రెవెన్యూ అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి కార్యాలయం, సిసిఎల్ఎ కార్యాలయం, పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారం, డివిజన్ లో ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్ల పరిశీలన, హైకోర్టు, ఆర్‌టిఐ, జాతీయ మానవ హక్కులు, లోకాయుక్త కమిషన్ కేసుల గురించి చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాలలో భూసే కరణ, అలియనేషన్ ప్రతిపాదనలు, నాలా కేసులు, డివిజన్ స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ తీర్మానాలు వాటి అమలు, ఓటరు జాబితా సవరణ తదితర అంశాలలో కలెక్టర్ సమ గ్రంగా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవిన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. ఏలాంటి సమస్య అయినా కాలాతీతం చేయకుండా వేగంగా స్పందించి చట్టప్రకారం చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించడమే మన ధ్యేయం కావాలని తెలిపారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులలో మొత్తం వచ్చిన దరఖాస్తులు ఎన్ని, పరిష్కరించినవి ఎన్ని, ప్రగతిలో ఉన్నవి ఎన్ని, పెండింగ్ లో ఎన్ని ఉన్నాయి, ఎస్ఎల్ఏ పరిధిలో ఉన్న దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తుల పై సమీక్షించారు. పిజిఆర్ఎస్ సిఎంకు అత్యంత ముఖ్యమైనదని, ప్రతి వారం పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం పై ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్ష చేస్తోందని తెలిపారు. రాజంపేట డివిజన్ లో ఫ్రీ హోల్డ్ రిజిస్ట్రేషన్




భూముల పరిశీలనను సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో బాగా నిర్వహించారని అన్నారు. కోర్టు కేసులు లోకాయుక్త, జాతీయ మానవ హక్కుల కమిషన్ కేసులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీ అయిన విఆర్ఓలను వెంటనే రిలీవ్ చేయాలని తహశీల్దార్లకు సూచించారు. బదిలీ అయిన ప్రదేశంలో విర్ఓలు విధుల్లో చేరాలని, విధుల్లో చేరని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జెసి ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ ఆయా అంశాల్లో తహశీల్దార్లు తమ పరిధిలో సమస్యల పరిష్కారానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని చెప్పారు. వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని ఈ మేరకు నిబంధనలను అవగాహన కల్పించుకొని మండల వారీగా పారదర్శకంగా విచారణ చేసి%ొ% సిఎస్‌డిటి, డిఎస్ఓలతో సంప్రదించి రేషన్ కార్డులు జారీ చేయాల్సిన జాబితాను రూపొందించాలని పేర్కొన్నారు. సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియాదేవి, సర్వే శాఖ జిల్లా అధికారి భరత్‌్నమార్, డిఎసఒ, తహసిల్దార్లు, డిటిలు, సీనియర్ అసిస్టెంట్లు, మండల సర్వేయర్లు, విఆర్ఓలు, విఆర్ఎలు, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

# 'సూపర్‌సిక్స్'పై శ్రద్ధ పెట్టండి : సిపిఎం



**కడప,తెలంగాణ దిశ:**ఎన్నికల ము ందు టిడిపి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై శ్రద్ధ పెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యా లయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలలో రైతులకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు, అమ్మకు వందనం, విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, దీపం పథకం కింద ఇస్తున్న మూడు సిలిండర్ల కూడా స్పష్టత లేదని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఉచిత ఇసుక విధానంలో కూడా ఆచరణలో చాలా గందరగోళం ఉందని, ఎన్నికల ముందు నాణ్యమైన విద్యుత్ ఇస్తామని, ఛార్జీల భారం వెయ్యమని చెప్పి అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో వేల కోట్ల రూపాయలు ప్రజల పైన విద్యుత్ భారాలు వేస్తుందని విమర్శించారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందారని, ఇప్పుడు బాబు కూడా అదే బాటలోనే పయనిస్తున్నారన్న విషయాన్ని ప్రజల గమనిస్తున్నారని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమ కోసం గతంలో దీక్షలు చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు కేంద్రంలో ఎన్‌డిఎలో భాగస్వామ్యం అయినా కూడా వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, పరిశ్రమలు తీసుకురావడంలో ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం జిల్లా మహాసభలు డిసెంబర్ 14,15 తేదీలలో నగరంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని చెప్పారు. మహాసభలలో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కోసం, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, నికర జలాలు, పరిశ్రమల కోసం జిల్లా మహాసభలలో చర్చించి, భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. మహాసభల సందర్భంగా ర్యాలీ, ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొంటారన్నారు. జిల్లా మహాసభలు జయప్రదానికి సహాయ, సహకారాలు అందించాలని ప్రజానీకానికి పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్ జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

## అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

**కడప,తెలంగాణ దిశ:** కడప నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. నగరంలోని సంజన్న సర్కిల్ నుంచి మాసాపేట రోడ్డు వరకు నూతనంగా నిర్మించిన బిటి రోడ్డును టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వివేకానంద రెడ్డి ఎమ్మెల్యే మాధవిని, శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాటలు చెప్పి చేతల్లో చూపలేకపోయిందని విమర్శించారు.



# సాగునీటి సమస్యలకు చెక్!

**ధర్మపురి,తెలంగాణ దిశ:**ఏళ్ల తరబడి సాగునీటి రంగంలో క్షేత్రస్థాయి సిబ్బంది లేక చివరి ఆయకట్టుకు నీరందించడం గగనంగా మారింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టాలని భావిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటనతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఓ వైపు జిల్లాలో గోదావరి ఎత్తిపోతల పథకాలు, రోళ్లవాగు ప్రాజెక్టు, అక్కపల్లి చెరువు రిజర్వాయర్, బోలిచెరువు, జంగనాల ప్రాజెక్టు, యశ్వంతరావుపేట ప్రాజెక్టు లాంటివి ఉండటం.. మరోవైపు డీ-53, డీ-86 ప్రధాన కాలువలు ఉన్నాయి. వీటి కింద లక్ష ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. కాలువల ద్వారా నీటిని వదిలిన సమయంలో అవి పూడికతో, పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో ఏటా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. గోదావరి ఎత్తిపోతల పథకాలు నూతనంగా నిర్మించడంతో వీటి కింద 20 వేల ఆయకట్టు పెరిగింది. ఈ పథకాలకు క్షేత్రస్థాయి సహాయ సిబ్బంది లేక నిర్వహణకు తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయి. గోదావరికి వరదలు వచ్చినప్పుడల్లా రైతులు సమష్టిగా పథకాలను బాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నూతన నియామక ప్రక్రియ రైతులకు దోహద పడనుంది. గోదావరి ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లకు ఎంతమంది ఎలక్ట్రిషియన్లు, ఫిట్టర్లు, పంపు మెకానిక్‌లు అవసరమో ప్రతిపాదించాలని ప్రభుత్వం ఇటీవల ఇరిగేషన్ అధికారులకు లేఖలు ఆ శాఖ ప్రధాన కార్యదర్శి ద్వారా పంపించింది. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో అన్ని పథకాలకు కలిపి 120 మంది వరకు అవసరం ఉంటారని నివేదించారు. ప్రభుత్వం 22 జులై 2016న



నీటిపారుదల శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుంటే ప్రధాన కాలువపై ప్రతి 9 కి.మీ.కి ఒకరు, ఉప కాలువపై ప్రతి 112 కి.మీల వరకు మరొకరు, డిస్ట్రిబ్యూటర్‌పై ప్రతి 2,500 ఎకరాల ఆయకట్టుకు లస్కర్లు ఉండాల్సి ఉండగా అమలు కావడం లేదు. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేసిన ప్రకటన, ప్రభుత్వం ప్రతిపాదనలను కోరడం నీటి పారుదల నిర్వహణలో నెలకొన్న దశాబ్దాల సమస్యలు పరిష్కారమవుతాయని భావిస్తున్నారు. సాగునీటి రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు వేస్తుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కొత్తగా లస్కర్లు, సహాయకుల నియామక ప్రక్రియకు సబంధించిన ప్రతిపాదలను ప్రభుత్వానికి నివేదించాం. వీరిని నియమిస్తే సాగునీటి సరఫరా సమస్యలు చాలా వరకు తగ్గే అవకాశముంది.

### చెత్త సేకరణ వాహనాల

# వినియోగంలో బల్దియా నిర్లక్ష్యం




**జగిత్యాల,తెలంగాణ దిశ:**జగిత్యాల పట్టణంలో 48 వార్డుల నుంచి నిత్యం 70 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. వార్డుల విలీనం తరువాత గృహాల సంఖ్య పెరగటం, కాలనీలను విస్తరించడంతో చెత్త సేకరణ బల్దియాకు సవాలుగా మారింది. వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆటోలు, ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో బల్దియా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో ఏడాది క్రితం ట్రాక్టరును.. రెండు నెలల కింద రూ.25 లక్షలతో 4 కొత్త ఆటోలను కొనుగోలు చేశారు. వీటిని వెంటనే ప్రారంభించి వినియోగించాల్సిన అవసరం ఉన్నా.. నిర్లక్ష్యంతో పక్కన పెట్టేశారు. స్థానిక 45వ వార్డులో పారిశుద్ధ్య సిబ్బంది వారం రోజులుగా చెత్త తొలగించలేదు. దసరా పండగపూట కాలనీవాసులు దుర్గంధంతో విసిగిపో యారు. కారణమేంటని కాలనీవాసులు ఆరా తీస్తే ఈ వార్డుకు చెందిన వాహనం 2 నెలలుగా మరమ్మతులో ఉందని పురపాలక సిబ్బంది తెలిపారు. కొత్త వాహనాలు కొనుగోలు చేసినా వార్డులకు కేటాయించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఈ చిత్రంలో ముసుగుకప్పి కనిపిస్తుంది కొత్త ట్రాక్టరు. చెత్త సేకరణ కోసం రూ.14 లక్షలు వెచ్చించి బల్దియా ఏడాది కిందట దీన్ని కొనుగోలు చేసింది. షోరూం నుంచి తెచ్చి విద్యానగర్ నీళ్లట్యాంకు వద్ద చెట్టుకింద ఇలా నిలిపారు. పురపాలిక అధికారుల నిర్లక్ష్యంతో సంవత్సరం నుంచి వినియోగానికి దూరమై తుప్పుపడుతోంది. పురపాలిక అధికారులకు మరమ్మతులపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి రూ.20 లక్షల చొప్పున మరమ్మతులకు వ్యయం చేస్తున్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనే డిమాండ్ రెండేళ్లుగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటం.. సభ్యుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొత్త వాహనాలు కొనుగోలు చేసినా మరమ్మతుల యావలోపడి వీటి నిర్వహణ మరిచారు. ప్రస్తుతం 15 ఆటోలు మరమ్మతు కోసం నెలల తరబడి మెకానిక్ షెడ్లలో మగ్గుతున్నాయి.

# నేతన్నలకు ఆధునిక శిక్షణ

**మంగళగిరి,తెలంగాణ దిశ:**మారుతున్న సమాజానికి తగ్గట్టుగా నూతన డిజైన్లు ఉత్పత్తికి అవసరమైన శిక్షణ నేతన్నలకు ఇచ్చి వారు తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు చేనేత జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. మంగళగిరిలో మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన చేనేత వీవర్స్ శాలను పరిశీలించారు.కార్మికులకు లభిస్తున్న ఆదాయం, ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నేతన్నలు తన కుటుంబ సభ్యులని వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని మంత్రి లోకేశ్ తనకు చెప్పినట్లు వివరించారు. నూతన డిజైన్లపై శిక్షణ ఇవ్వడంతో పాటు మంత్రి లోకేశ్ ఉపాధి కల్పిస్తున్నారన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ తిరిగి అమల్లోకి తెస్తామన్నారు. దసరా పండగ దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో చేనేత వస్త్ర విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాల కారణంగా నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలకు రూ.25 వేలు పరిహారం, నూలుకోసం అదనంగా మరో రూ.5 వేలు అందజేస్తామన్నారు. వీవర్స్ సర్వీసు సెంటర్ల ద్వారా 6 వేల మందికి, 5302 నూతన డిజైన్లు రూపొందించి శిక్షణ ఇచ్చామ న్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో



375శిక్షణ తరగతులు నిర్వ హించామన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి,అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, నాయకులు జానకీదేవి, దామర్ల రాజు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు

# డిసెంబరులో రాజధాని పనులు ప్రారంభిస్తాం



రాజధాని పరిధిలోని 29 గ్రామాలను సమానంగా అ భివృద్ధి చేస్తామని, త్వరలో అన్ని పనులు ప్రారంభమవు తాయని పుర పాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నిడమర్రు, కురగల్లు గ్రా మాలకు చెందిన 10 మంది రైతులు 17 ఎకరాల భూమిని రాజధాని అవసరాలకోసం స్వచ్ఛందంగా భూ సమీకరణకు ముందు కొచ్చి అంగీకార పత్రాలను అందించారు. మంత్రి నారాయణ ఆ పత్రాలను స్వీకరించి సీఆర్డీఏ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 360 కి.మీ. రోడ్లు, సుమారు 3 వేల అంతర్గత రోడ్లు, అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం భవనాలు, అసెంబ్లీ, హైకోర్టు తదితర నిర్మాణ పనులను డిసెంబరులో ప్రారంభిస్తామన్నారు. '29 గ్రామాల్లో మూడు వేల ఎకరాలు ఇంకా భూ సమీకరణకు రావాల్సి ఉంది. కొంతమంది రైతులు ప్రస్తుతం భూములిచ్చేందుకు తమను సంప్రదిస్తున్నార'ని తెలిపారు. రైతులు ఎవ రు ముందుకొస్తారో మిగిలిన ప్లాట్లలో వారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. రైతు సోదరులు ఎంతోమంది ముందుకొస్తున్నా రన్నారు. కురగల్లు, నిడమర్రు, తుళ్లూరు మండలం రాయపూడిలో 21 ఎకరాలు రైతులు ఇచ్చారన్నారు. నిర్మాణాలను నిపుణులు పరి శీలించి ఇబ్బంది లేద న్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టులను రద్దుచేసి మళ్లీ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ సీఆర్డీఏ అధికారులు చేపట్టారని వెల్లడించారు. సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సాయిసూర్య ప్రవీణ్‌చంద్, డిప్యూటీ కలెక్టర్ భీమారావు, తహసీల్దార్ ఆంజనేయులు, ఉప తహసీల్దార్ శ్రీనివాసరావు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు నియంత్రణకు మార్గం ఏదీ ?

ఉమ్మడి జిల్లాలో తరచూ గంజాయి పట్టుబడుతోండటం ఆందోళన కలిగిస్తోంది. ఇతర జిల్లాలు,రాష్ట్రాల నుంచి రోడ్డు, రైలు మార్గానా మహమ్మారి ఇక్కడికి చేరుతోంది. గత 8 నెలల వ్యవధిలోనే ఎక్సైజ్, పోలీసు అధికారులు కిలోల కొద్ది గంజాయిని పట్టుకోవటాన్ని గమనిస్తే దందా ఏ మేరకు సాగుతుందో అర్థమవుతోంది. మరోవైపు గంజాయికి గ్రామీణ యువత, విద్యార్థులు బానిసలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తున్న విషయం. అనారోగ్యానికి గురవుతామని తెలిసిన వారు మత్తు వీడటం లేదు. ఎక్కువగా నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి వినియోగిస్తున్నారు. స్థానికులు, ఇతర రాష్ట్రాల వారు ఇక్కడికి రైల్వే మార్గంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేస్తున్నారు. రామగుండం, పెద్దపల్లి, ఓదెల, పొత్కపల్లి, బిజిగిరిషరీఫ్, జమ్మికుంట రైల్వేస్టేషన్లు మహారాష్ట్ర, ఒడిశా,ఏపీ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉండటంతో అక్కడి నుంచి గంజాయి ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చేరుతోంది. రోడ్డు మార్గంలో రవాణా చేస్తూ కూడా నిందితులు పట్టుబడ్డ దాఖలాలు ఉన్నాయి. జమ్మికుంట రైల్వేస్టేషన్ వద్ద ఓ మహిళ 400 గ్రాముల గంజాయితో స్థానిక ఆబ్కారీ పోలీసులకు పట్టుబడింది. జమ్మికుంటలో ఉంటూ మహారాష్ట్రకు చెందిన వ్యక్తులతో రైల్వే మార్గంలో గంజాయి రవాణా చేస్తున్న విచారణలో తేలింది.

# కేరళ స్కూళ్లు చైతన్య కేంద్రాలు



పాఠశాలలంటే..? ఎత్తైన భవనాలు, చుట్టూ ప్రహరీ గోడలు, ఖరీదైన స్కూల్ యూనిఫామ్‌లు కాదు. మానవ జీవితాలను తీర్చిదిద్ది, జాతి భవితను రూపొందించే జీవన నిలయాలు, చైతన్య కేంద్రాలు. మానవీయవిలువల్ని పాదుకొలిపే ఆధునిక దేవాలయాలు. అలాంటి విద్యా విధానాన్ని కేరళలో ప్రత్యక్షంగా అధ్యయనం చేశాం. కోజికోడ్‌లో కేరళ బాలల సంఘం 7వ రాష్ట్ర మహాసభల సందర్భంగా సౌహార్ద సందేశకులుగా పాల్గొన్నాం. అక్కడ చదువులే కాదు. ఆటపాటలతో పాటు జీవిత పాఠాలనూ నేర్పుతారు. తరగతి గదుల్లోనే నిజమైన పౌరులను తీర్చిదిద్దుతున్నారు. మంచి వాతావరణం, సారవంతమైన నేలలో నాణ్యమైన విత్తనాలు విత్తితేనే, చక్కటి ఫలాలనిచ్చే వృక్షాలుగా ఎదుగుతాయి. తల్లిని నేల/నీరుగా.. తండ్రిని విత్తనంగా భావిస్తే.. ఉపాధ్యాయుడు సూర్యరశ్మి లాంటివాడు. వీరుముగ్గురు మాత్రమే చిన్నారులను మంచి పౌరులుగా మలచగలుగుతారు. ఈ ముగ్గురి భాగస్వామ్యంతో నడుస్తున్నదే కేరళ విద్యా వ్యవస్థ.మనిషి తత్వం, ప్రేమతత్వం, సోదరత్వం తోటి వారికి తోడ్పడాలన్న దృఢ సంకల్పంతో ఏర్పడినదే కేరళ బాలల సంఘం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, జాతీయోద్యమ స్ఫూర్తితో కుల,మత, ప్రాంత, భాష లింగ వివక్ష లేని ప్రపంచ శాంతి, ప్రకృతి పర్యావరణ ఎజెండాగా, ఉచిత ఆహారం, బస్సు సౌకర్యం, సంపూర్ణ అక్షరాస్యత దిశగా బాలల హక్కుల్ని వివరిస్తూ అడుగులు వేసింది. పల్లెల్లో ఉన్న ప్రతి పిల్లవాడికి భరోసా అయ్యింది. బాలల సంఘం కేరళ మొత్తం విస్తరించింది. 14 జిల్లాలలో 210 ప్రాంతాలలో 2,279 గ్రామాలలో 31,258యూనిట్లలో 13లక్షల మంది బాలలతో విస్తరించింది. గౌతమ బుద్ధుని నుండి మహాత్మా గాంధీ వరకు మాంటిస్సోరి నుండి గిజూబాయి వరకు ఎందరో మహనీయుల బాటలో బాలబాలికలను తీర్చిదిద్దుతున్నారు. అక్కడ పెద్దలు పిల్లలతో స్నేహం చేస్తారు. పిల్లలు చెప్పింది శ్రద్ధగా వింటారు. పిల్లల అభిప్రాయాలను తల్లిదండ్రులు, పెద్దలు ఆలకించే సాంప్రదాయం వారి సంస్కృతిలోనే ఉంది. ఆంగ్ల భాషతో పాటు అన్య భాషలు ఎన్ని నేర్చినా.. పాలనలో బోధనలో మాతృభాషపై మమకారం తగ్గలేదు.

విద్యపై విజన్: విద్యపై చేసే ఖర్చులను భావితరాల భవిష్యత్తుకు పునాదిగా చూస్తున్నది కేరళ వామపక్ష ప్రభుత్వం. బడిని బాగు చేయడాన్ని రేపటి పెట్టుబడిగా గుర్తించింది. చదువుల విప్లవం తెచ్చింది. బాల కార్మిక రహిత రాష్ట్రంగా బాల కార్మికుల అక్రమ రవాణాపై పోరాడేందుకు బాలల సంరక్షణ యూనిట్‌ను ఏర్పరిచింది. అక్రమ రవాణా, పిల్లల యాచన, అర్ధాంతరంగా చదువు ఆపేసిన విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించింది. డ్రాపౌట్లు లేకుండా చూసే బాధ్యత చైల్డ్ హెల్ప్ డెస్క్ రెస్క్యూ ఫోర్స్ సహాయం సమన్వయంతో అధికారులు 24 గంటలు షిఫ్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు.

కార్మికుల జాడకోసం వారానికి మూడు రోజులు తనిఖీలు నిర్వహిస్తారు. బాలకార్మికులు కనిపిస్తే విడిపించి యాజమాన్యాలపై కేసులు పెడతారు. పిల్లలు పనిలోకాదు. బడిలో ఉండాలి. బడికి రాని పిల్లలందరూ బాలకార్మికులే. బాల్యం ఒక హక్కు. పిల్లల చదువుల ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించి, కేరళ సమాజాన్ని ఒప్పించి "బాల్యం బడిలోనే" ఉండాలని తీర్మానం చేశారు.

# కొలికపూడి సంగతేంటీ..?

**విజయవాడ,తెలంగాణ దిశ:**తెలుగుదేశం పార్టీ అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ. ప్రాంతీయపార్టీ కావడంతో అధినేత ఆగ్రహానికి గురి కాకూడదని ఎవరైనా భావిస్తారు. కానీఈటర్మ్ లో మాత్రం ఎమ్మెల్యే లు మాత్రం నోరు జారిపోతున్నారు. తాడిపత్రిలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రతి రోజూ ఏదో ఒక వివాదాస్పద వ్యాఖ్యలు చేసి కూటమి పార్టీలకు తలనొప్పిగా తయారయ్యారు. మూడు పార్టీల్లోనూ ఇబ్బందికరమైన పరిస్థితులను ఎమ్మెల్యేలు సృష్టిస్తున్నారు. కానీ అధినాయకత్వం ఏ చర్యలు తీసుకోలేకపోతుంది. ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్ధసారధి ఆ పార్టీ లైన్ కు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. జనసేనలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటున్నారు. ఇక టీడీపీలో కృష్ణాజిల్లాలోని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కూడా అంతే. ఆయనను కట్టడిచేయడం ఎవరి వల్ల కావడం లేదు. తొలిసారి గెలిచిన కొలికపూడి శ్రీనివాసరావు సొంత పార్టీ నేతలను ఇబ్బంది పెడుతున్నారు. అమరావతి రాజధాని ఉద్యమంలో పాల్గొని చంద్రబాబుకు దగ్గరై కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు టిక్కెట్‌ను సంపాదించారు. చంద్రబాబు టిక్కెట్ ఇచ్చారు. కొలికపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యే అయిన వెంటనే తన వైఖరిని పూర్తిగా మార్చారు. సొంతపార్టీ నేతలనే వేధింపులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలువచ్చాయి. తిరువూరు నియోజకవర్గంలో ఒక ఇంటిని కూల్చివేయ డానికి తానే కుర్చీ వేసుకుని కూల్చేందుకు చేసిన ప్రయత్నం కూడా విమర్శలకు దారి తీసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొలికపూడి శ్రీనివాసరావును పిలిచి క్లాస్ పీకినట్లు వార్తలు వచ్చాయి.

# వ్యూహాలు... ప్రతి వ్యూహాలు?




**హైదరాబాద్,తెలంగాణ దిశ:**తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఆధిపత్య పోరు ఆగడం లేదు. బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడినా.ఆ పార్టీ వ్యూహాల ముందు.. అధికార కాంగ్రెస్ ప్లాన్స్ ఫెయిల్ అవుతున్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును జైలుకు పంపాలన్న రేవంత్‌రెడ్డి ఎత్తులు ఫలించకపోగా, చోటామోటా నాయకులను కూడా జైల్లో పెట్టలేకపోతున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ ఎత్తులు.. ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహాల ముందు చిత్తవుతున్నాయి. తెలంగాణను పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటి నుంచి ఆరోపిస్తూనే ఉన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చారు. సీఎంగఉన్నారు. కానీ, గత పాలకులు చేసిన ఒక్క అవినీతిని కూడా నిరూపించలేకపోతున్నారు. కాళేశ్వరం,విద్యుత్‌కొనుగోళ్ల ఒప్పందాలపై వేసిన కమిషన్ల విచారణ కొనసాగుతోంది. ఇకఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కొలిక్కి రాలేదు. ఫార్ములాఈ కార్‌రేసులో అనుమతి లేకుండా విదేశీసంస్థకు నిధులు కేటాయించడం వ్యవహారంలో కేసు నమోదు.. ధరణిలో అక్రమాలు,గొర్రెల పంపిణీ పథకం, మిషన్ భగీరథలో అక్రమాలు ఇలాచాలా అంశాలు ఉన్నాయి. కానీ, ఇప్పటి వరకు ఒక్క అవినీతిని కూడా రేవంత్ సర్కార్ నిరూపించలేకపోయింది ఇదిలా ఉంటే.. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నా..బీఆర్ఎస్ నేతలు తామే అధికారంలో ఉన్నట్లు ప్రభుత్వంపై ఆధిపత్యంచెలాయిస్తున్నారు. కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరే సీఎం రేవంత్‌రెడ్డితోపాటు,ఆయన క్యాబినెట్‌లోని 10మందిని ముప్పు తిప్పలు పెడుతున్నారు. బీఆర్ఎస్ విమర్శలు, ఆరోపణలను మంత్రులు, ఎమ్మెల్యేలు తిప్పికొట్టడంలో విఫలమవుతున్నారు. దీంతో బీఆర్ఎస్ నేతల దూకుడు కొనసాగుతోంది. కేటీఆర్, హరీశ్‌రావులకు తోడు.. ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి,ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్ తోడవడంతో అధికార పార్టీపై విమర్శల దాడి కొనసాగుతోంది.ఇక సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు కనీసం సీఎంగా చూడడం లేదు. నోటికి ఎంత వస్తే అంత మాట అనేస్తున్నారు. అయినా ఏమిచేయలేని పరస్థితిలో అధికారపార్టీ నేతలు ఉన్నారు. అప్పుడప్పుడు కేసులు పెడుతున్నా.. అరెస్టులు చేస్తున్నా.. అవన్నీ మొక్కుబడిగానే మారుతున్నాయి. బీఆర్ఎస్ నేతలను కంట్రోల్ చేయలేకపోతున్నాయి. లగచర్ల కేసులో పట్నం మహేందర్‌రెడ్డిని అరెస్టు చేసిన20 రోజులకే బెయిల్ వచ్చింది. ఇకపాడి కౌశిక్‌రెడ్డిపై ఇప్పటికే పలు కేసులు పెట్టారు. అరెస్టు చేసిన ఒకటి రెండు రోజులకు మించి జైల్లో పెట్టలేకపోతున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై అధికారిక కార్యక్రమంలో కొట్టేంత పని చేసినా..అధికార పార్టీ ఏమిచేయలేని పరిస్థితిలోఉంది. మూడు కేసులు పెట్టి అరెస్టు చేసినా.. వెంటనే బెయిల్ వచ్చేసింది.కౌశిక్‌రెడ్డిని ఈసారి ఎలాగైనా జైల్లో పెట్టాలని రేవంత్ సర్కార్ ప్లాన్ చేసింది.మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుల ఎందుటే పాడి కౌశిక్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యేను కొట్టినంత పనిచేశాడు.అయినా ఏమిచేయలేని పరిస్థితి ఉంది. మంత్రులు ముగ్గురితో కేసులు పెట్టించినా.. సెలవు రోజుచూసి అరెస్టు చేసినా..కనీసం ఒక్క రోజుకూడా జైల్లో ఉంచలేకపోయారు. దీంతో అధికార పార్టీలో సమన్వయలోపం.. అధికారులు అధికారులు, పోలీసులు అధికార పార్టీకి సహకరించడం లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ఈ భూమి మాకొద్దు మహాప్రభో...!?

## సరెండర్ చేస్తున్న సిరిసిల్ల జనాలు..!

**కరీంనగర్,తెలంగాణ దిశ:**ఎక్కడైనా ఈ భూములు మాకొద్దు అంటూ కలెక్టర్‌ను కలిసి వాపస్ చేసినసీన్లు చూశారా?ఇప్పుడు చూపిస్తాం చూడండి..సుంచుల కుమారస్వామి. బీఆర్ఎస్ లోకల్ లీడర్. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లి పరిధిలోని సర్వే నంబర్ 464లోని 3ఎకరాల ప్రభుత్వ భూమి ఈయన సొంతమైంది. సీన్‌కట్ చేస్తే ఇప్పుడు సిరిసిల్ల జిల్లాలో ఇలా కబ్జాలు చేసిన వారంతా అరెస్టై జైలుకు వెళ్లారు. దీంతో కేసులభయం ఎందుకని చెప్పి ఇదిగోఇలా జిల్లా కలెక్టర్,ఎస్పీని కలిసి ఈభూమి నాకొద్దు మహాప్రభో అని సరెండర్ చేస్తున్నట్లు ప్రకటించారు.చాలామంది చేసుకున్నట్లే నేను చేసుకున్నా.. ఇప్పుడు వద్దని ఇచ్చేస్తున్నా.. ఇదీ డైలాగ్. ఇదొక్క ఎగ్జాంపులే కాదు.. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ కూడా 2ఎకరాల భూమిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు సరెండర్ చేశారు. కేసులు నమోదవుతుండడంతోకబ్జా,అక్రమ పట్టాదారుల్లో భయాలు మొదలయ్యాయి. దీంతో ఎందుకొచ్చిన తంటా అని చెప్పి భూముల్ని వాపస్ చేస్తున్నారు. అదీ మ్యాటర్. ఒకవైపు సిరిసిల్లలో అసైన్డ్ ల్యాండ్స్‌ను కబ్జాలు చేసి ధరణి వచ్చాకతమపేర్లపై మార్చుకుని గులాబీ లీడర్లు చేసిన దందాలు బయటికొస్తున్నాయి. చెరువు,అటవీ, అసైన్డ్ ఇలా దేన్నీ వదల్లేదు. ధరణి వచ్చాక ఇంకింత రెచ్చిపోయారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన జీవోలను ఆసరాగా చేసుకుని చక్రం తిప్పుకున్నారు. ఇప్పుడు కటకటాలు లెక్కపెడుతున్నారు. నాడు కేటీఆర్ మంత్రిగా ఉండడంతో అధికారులు కూడా చూస్తూ ఉండిపోయారు. ఏమీ చేయలేకపోయారు. కానీఇప్పుడు ప్రభుత్వం మారింది. కథ మారింది. అందుకే అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. సిరిసిల్ల లాండ్ ఫైల్స్ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఇక్కడ అన్నిటికంటే హైలెట్ ఏంటంటే.. కొట్టేసిన భూముల్ని వరుసగా ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు ముందుకొస్తున్నారు. అంటే అక్కడ ఏంజరిగిందో ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్, ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టా చేసుకున్న బీఆర్ఎస్ లీడర్ల అరెస్ట్ లు కంటిన్యూ అవుతున్నాయి. బీఆర్ఎస్ సీనియర్ లీడర్ బొల్లి రామ్మోహన్, అగ్గి రాములు, జిందం దేవదాస్, సురభి నవీన్ రావుపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు ఈనెల 7న తంగళ్లపల్లి మండలం నేరేళ్ల బీఆర్ఎస్ నేత పూడూరి భాస్కర్‌ను రిమాండ్ కు తరలించారు. భాస్కర్ మండేపల్లిలో 20గుంటల అసైన్డ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని రెవెన్యూ అధికారులు తేల్చడంతో కటకటాలు లెక్కిస్తున్న పరిస్థితి. అంతే కాదు తంగళ్లపల్లి మండలానికి చెందిన మరో నలుగురు లీడర్లు పరారీలో ఉన్నారని కూడా చెబుతున్నారు. తంగళ్ళపల్లి మండలం తాడూరులోని సర్వే నంబర్ 1148లో సురభి నవీన్ రావు 3 ఎకరాలు, సురభి దేవేందర్ రావు పేరిట 3 ఎకరాలుమొత్తం 11ఎకరాలు కబ్జా అయ్యాయని నిర్ధారించారు. కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించారు. 11 ఎకరాలను తిరిగి ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో మార్చారు కలెక్టర్. ఇక బొల్లి రామ్మోహన్ ఈయన సిరిసిల్ల జిల్లాలో సీనియర్ బీఆర్ఎస్ లీడర్. సర్దాపూర్, బద్నేపల్లిలో ఏడు ఎకరాలను మాయ చేసి పట్టా పొందారు.

దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేశారు.ధరణి వచ్చే టైంలో నాటి బీఆర్ఎస్ సర్కార్ ఓఉత్తర్వు ఇచ్చింది. దాని ప్రకారం 2017 డిసెంబర్ 31 కంటే ముందు ఎవరైనా భూమిలేని పేదవారు అసైన్డ్ భూమి కొనుగోలు చేస్తే,వారిని ఆ భూమి నుంచి తొలగించకుండా వారికే అసైన్మెంట్ పట్టాజారీ చేయొచ్చని భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో నాటి బీ ఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీఅదే మంచి సమయం అనుకున్న చాలా మంది బీఆర్ఎస్ లీడర్లు..అసైన్డ్ భూములను చాలా తక్కువ ధరకు పేదల నుంచి రాయించుకుని.. పాస్ బుక్స్ పొందారు. ఇదే జీవోను అడ్డం పెట్టుకుని సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తమ్ముడు జిందం దేవదాసు లాండ్ పొందారు. తంగళ్లపల్లి మండలం సారంపెల్లి శివారులోని 164/3లో 3 ఎకరాలు కొన్నాడు.

ప్రభుత్వ రూల్స్ ప్రకారం.. అసైన్డ్‌ల్యాండ్ కొనాలంటే ఆ వ్యక్తి స్థానికుడై ఉండాలి. భూమి లేని పేద రైతుఅయిఉండాలి.అదేభూమిపై ఆధారపడితేనే రీఅసైన్ చేయాలి. కానీ జిందం దేవదాసు ఐటీ రిటర్న్ ఫైల్ చేస్తున్న బడా కాంట్రాక్టర్. అప్పట్లోనే అతడికి నోటీసులు ఇచ్చి కేసునమోదు చేయాల్సి ఉన్నప్పటికీ అప్పటి తహసీల్దార్ పట్టించుకోకుండా పాస్‌బుక్ జారీ చేశారు. అంతే కాదు నాడు మంత్రిగా ఉన్న కేటీఆర్ సొంత నియోజకవర్గం సిరిసిల్లకు వచ్చినప్పుడల్లా వెంట ఉండే వారు కావడంతో అధికారులు కూడా ఏమీ చేయలేకపోయారు.ప్రభుత్వ భూములను పట్టా చేయించుకున్నవారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రధాన అనుచరుడు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేరు కూడా ఉంది.

# ఐదు జిల్లాల్లో కరువు పరిస్థితులు



**కర్నూలు,తెలంగాణ దిశ:** ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది నెలకొన్న ఖరీఫ్ కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన కేంద్ర నుంచి సాయం అందించే విషయంలో ఉదారంగా స్పందించాలని ఏపీ రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్, ఆర్పీ సిసోడియా కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను రెవిన్యూ కార్యదర్శి సిసోడియా కేంద్ర బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాల్లోని 54 మండలాల్లో గత ఏడాది కరువు పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో - 19మండలాలు, చిత్తూరులో - 16 మండలాలు, శ్రీ సత్య సాయిలో-10 మండలాలు, అనంతపురంలో - 7 మండలాలు, కర్నూలులో - 2 మండలాలను ఇప్పటికే ఇప్పటికే కరువు మండలాలు ప్రకటించారు. వాటిలో 27 తీవ్ర కరువు మండలాలు, 27 మధ్యస్థ కరువు మండలాలుగా సిసోడియా పేర్కొన్నారు.కేంద్ర కరువు మాన్యువల్ ప్రకారం సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్యధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33% అంతకంటే ఎక్కువ ఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించిందని వివరించారు. కరువు ప్రభావంతో పత్తి, జొన్న, వేరుశెనగ, ఎర్ర శనగలు, మొక్కజొన్న మొదలైన 14 రకాల పంటలు దెబ్బతిని ఐదు జిల్లాల్లోని 1.06లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 1.44 లక్షల మంది రైతులు నష్టపోయారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 1 లక్ష మంది రైతులకు రూ.16.67 కోట్ల వ్యయంతో సుమారు 1 లక్ష మంది రైతులకు 80% సబ్సిడీపై విత్తనాలు, రూ.55.47 కోట్ల వ్యయంతో పశుగ్రాసం, పశుగ్రాస విత్తనాల సరఫరా, 60% సబ్సిడీపై,40% సబ్సిడీపై చాఫ్ కట్టర్లు, మందుల సరఫరా వంటి ఉపశమన చర్యలు చేపట్టినట్లు కేంద్ర బృందానికి సిసోడియా వివరించారు.వ్యవసాయ శాఖ ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ.90.62కోట్లు, రూరల్ వాటర్ సప్లై రూ.0.78 కోట్లు, అర్బన్ వాటర్ సప్లై రూ.4.89 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.55.47 కోట్లు ఆర్థిక సహాయం అవసరమన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని, రైతులను ఆదుకోడానికి సత్వరమే రూ.151.77 కోట్లు సాయం చేయాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు.అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి,చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని కరువు మండలాల్లో రైతులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను గమనించామనితమ నివేదికలో కేంద్రానికి అన్ని విషయాలను సమగ్రంగా తెలుపుతామని అన్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ కరువు పరిస్థితుల తెలియజేశాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు కరువు వల్ల తమకు జరిగిన నష్టాన్ని వివరించారని చెప్పారు.


# కూటమి వైపు వైసీపీ చూపులు..!?




**విజయవాడ,తెలంగాణ దిశ:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలోఏదో కూటమిలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇండియా కూటమి నేతృత్వం నుంచి కాంగ్రెస్ పార్టీ వైదొలిగి మమతా బెనర్జీ నాయకత్వంలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాను సిద్ధమేనని మమతా బెనర్జీ ప్రకటించిన తర్వాత అనూహ్యంగా పలుపార్టీలు మద్దతు పలికాయి. ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు దీదీ నాయకత్వానికి ఓకేఅంటే సరే అనుకోవచ్చు కానీ జగన్ నేతృత్వంలోని వైసీపీ కూడా మద్దతు పలికడంరాబోతున్న మార్పులకు సూచనగా మారింది. ప్రస్తుతం ఇండియా కూటమి చీలిక దిశగాఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్ తో కలసి పని చేసేందుకు సిద్ధంగా లేదు. హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ ఆప్ ను పట్టించుకోలేదు. ఇప్పుడు ఆప్‌కాంగ్రెస్‌ను పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్‌ను కాదని ప్రాంతీయ పార్టీల నేతలే కూటమికి నేతృత్వం వహించాలని కోరుకుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్, అఖిలేష్ యాదవ్ వంటి వారు ఈ డిమాండ్ ను సమర్థిస్తున్నారు. ఇతర పార్టీలు కూడా ఓకే అంటే.. నాయకత్వం మారే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ కూడా ఈ అంశంపై కూటమిని నిర్మించే బాధ్యత ప్రాంతీయ పార్టీలకు ఇచ్చే అవకాశాలనుపరిశీలించే చాన్స్ ఉందని అనుకుంటున్నారు. విజయసాయిరెడ్డి ఇండియా కూటమికి దీదీ నాయకత్వం వహిస్తే బాగుంటుందని ప్రకటించేశారు. మామూలుగా అయితే ఆ కూటమికి ఎవరు నేతృత్వం వహిస్తే మాకేంటి అంటారు కానీ ఆయన తీరు మాత్రం వేరుగా ఉంది. ప్రస్తుతం వైసీపీ అత్యంత బలహీనంగా ఉంది. అసెంబ్లీకి వెళ్లడం లేదు. ఈ పరిస్థితులు చూస్తే రానున్న రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. వీటిని ఎదుర్కోవాలంటే తమకు ఓ కూటమి మద్దతు ఉండాలని అనుకుంటున్నారు. కాంగ్రెస్ ఉన్న కూటమిలో చేరడానికి ఇంత కాలం సంశయిస్తూ వస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో ధర్నా చేసినప్పుడు కాంగ్రెస్ మినహా మిగతా ఇండియా కూటమి పార్టీలన్నీ హాజరయ్యాయి. ఇప్పుడు ఆ వ్యూహం వెనుక ఉన్న రాజకీయం వెలుగులోకి వస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మమతా బెనర్జీ నేతృత్వంలో త్వరలో ఇండియా కూటమి పునర్ వ్యవస్థీకరణ జరగనుంది. కాంగ్రెస్ పార్టీ ఉంటుందో ఉండదో కానీ.. వైసీపీ చేరడం మాత్రం పక్కా అని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. మమతా బెనర్జీ కూడా నేరుగా జగన్ తో సంప్రదింపులు జరుపుతున్నారని అంటున్నారు. ఇంత కాలం బీజేపీతో లొల్లి పెట్టుకోవడానికి ఏ మాత్రం ఇష్టపడని జగన్ ఇప్పుడు ఆ పార్టీని నమ్మడానికి సిద్ధంగా లేరు. అందుకే ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారన్న అభిప్రాయం ఢిల్లీలో గట్టిగా వినిపిస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చి ఇంకా ఏడాది పూర్తి కాలేదు. రానున్న ఐదేళ్లు పార్టీ నుంచి మరిన్ని ఒత్తిళ్లు ఉంటాయని భావిస్తున్నారట. పార్టీలో ఉండి కష్టాలు కోరి తెచ్చుకునే కంటే, రాజీనామా చేస్తే బెటరని అనుకుంటున్నారు. ఇటు పార్టీకి.. అటు ప్రభుత్వానికి దూరంగా ఉంటే ఎలాంటి సమస్యలు ఉండదన్నది ఆయా నేతల ఆలోచన.మరికొందరికి సొంత నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. అధిష్టానం వద్ద ఎంత మొరపెట్టుకున్నా, ఫలితం లేకపోయింది. ఫలితంగా ఫ్యాన్‌కి దూరంగా ఉండేందుకు సిద్ధపడుతున్నారు. ఇంకొందరు నేతలు ఏపీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు.ప్రస్తుతం కూటమి సర్కార్‌కు కేంద్రం నుంచి అన్నివిధాలుగా సహాయ సహకారాలున్నాయి. కూటమిలో చీలిక వచ్చే ప్రసక్తి లేదని భావిస్తున్నారు. ఒకవేళ వైసీపీ పుంచుకున్నా, మళ్లీ అధికారంలోకి రావడం కష్టమని, కాకపోతే బలమైన ప్రతిపక్షంగా తయారు కావచ్చునే అంచనాలు లేకపోలేదు. ఆ లెక్కన దాదాపు పదేళ్లు ప్రతిపక్షానికి పరిమితం కావాల్సి ఉంటుందన్నమాట.ఇప్పుడున్న పరిస్థితుల్లో అయితే టీడీపీ, లేదంటే జనసేన, ఇంకా లేదంటే బీజేపీ వైపు వెళ్తే సేఫ్‌గాఉండవచ్చని భావిస్తున్నారట. ఇప్పటికిప్పుడు కాకపోయినా ఫ్యూచర్‌లో బెటర్ లైఫ్ ఉంటుందనేది నేతల భావన. రాబోయే ఐదేళ్లలో వైసీపీలో ఉండేదెవరు? వెళ్లిపోయేదెవరు? ఎందుకు ఆయా నేతలను ఆపే ప్రయత్నం చేయలేకపోతోంది? మొత్తానికి రాబోయే ఐదేళ్లు మాత్రం వైసీపీ గడ్డుకాలమేనని చెప్పక తప్పదు.

# బెంగళూరులో ఐటీ సంక్షోభం!

**గత ఏడాది 50 వేల మంది టెకీలకు ఉద్వాసన**
**ఈ ఏడాదిలోనూ భారీగా ఉద్యోగ కోతలు**
**సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో పెరుగుతున్న ఆందోళన**
**రియల్ వ్యాపారుల్లోనూ భయం భయం**




బెంగళూరు: భారత సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులో ఎన్నడూ లేని సంక్షోభం నెలకొంది. ఈ టెక్ హబ్ ప్రస్తుతం తీవ్ర ఉద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. వ్యయ నియంత్రణ చర్యలతో పాటు ఆటోమేషన్, కృత్రిమ మేధ కారణంగా ఐటీ సెక్టార్‌లో చాలా సంస్థలు సామూహిక తొలగింపులు చేపడుతున్నాయి. 2024లో సుమారు 50 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్టు ఇన్‌షార్ట్స్‌లోని ఒక నివేదిక తెలిపింది. గత ఏడాది అర లక్ష మందిని తీసేశారని, ఈ ఏడాది ఎంతమందిని ఇంటికి పంపుతారో అర్థం కావడం లేదని ఐటీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంక్షోభ ప్రభావం హౌసింగ్, రియల్ ఎస్టేట్, స్థానిక వ్యాపారాలపైనా పడనుంది. రానున్న కొన్ని వారాలు, నెలల్లో ఐటీ సంస్థల్లో లేఆఫ్‌లు తీవ్రంగా ఉంటాయని భావిస్తున్నారు.

%చిన్న ఉద్యోగులకు పెద్ద కష్టం: లేఆఫ్‌ల్లో ఎక్కువగా బాధితులుగా మిగిలేది దిగువ స్థాయి ఉద్యోగులే. ఆటోమేషన్, ఏఐ సంక్షోభం కారణంగా చేపట్టే కాస్ట్ కటింగ్‌లలో మొదట బలయ్యేది వీరే. వీరిలో ఎంట్రీ లెవెల్ ప్రోగ్రామర్లు, సాఫ్ట్‌వేర్ టెస్టర్లు అధికంగా ఉంటారు. వీరి స్థానాలను ఏఐ భర్తీ చేస్తుంది. కోడింగ్, డీబగ్, సాఫ్ట్‌వేర్ ఆప్టిమైజేషన్ వంటి పనులన్నీ పూర్తి సామర్థ్యంతో, అతి తక్కువ ఖర్చుతో ఏఐ ద్వారానే చేపడతారు. 'చాలామంది టెక్ ఉద్యోగులు ఆటోమేషన్ అన్నది సుదీర్ఘ ముప్పు అని గుర్తించడంలో విఫలమవుతున్నారు. దీంతో ప్రాథమికంగా అది ఉపాధి దృశ్యాన్నే మార్చేస్తుంది' అని ప్రముఖ కంపెనీ హెచ్‌ఆర్ హెడ్ ఒకరు తెలిపారు.

గృహ నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం: లేఆఫ్‌ల ప్రభావం తొలుత బెంగళూరులో పీజీ అకామిడేషన్లు, రెంటల్ మార్కెట్, తక్కువ అద్దెలుండే ఇండ్లపై పడుతుంది. చిన్న చిన్న ఉద్యోగుల్లో చాలామంది ఈ పీజీ అకామిడేషన్లలోనే ఉంటున్నారు. వారి ఉద్యోగాలు పోతే ఇవి కూడా ఖాళీ అవ్వడం ఖాయం.

ఇప్పటికే పలువురు యజమానులు వీటిపై పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టి నెలసరి ఆదాయాన్ని పొందుతున్నారు. ఇప్పుడు వీటికి డిమాండ్ తగ్గితే ఆదాయం పడిపోవడంతో పాటు, ఆస్తుల విలువ కూడా తగ్గిపోతుందని, యజమానులు ఆందోళన చెందుతున్నారు. టెక్ పార్కులు, కార్పొరేట్ కార్యాలయాలకు హాట్ స్పాట్ లాంటి ఔటర్ రింగ్ రోడ్‌కు సమీపంలో పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టిన వారు కూడా హడలిపోతున్నారు.

భవిష్యత్తులో బెంగళూరు ఉజ్వలంగా ఉంటుందని భావించి దీర్ఘకాలం రెంటల్ ఆదాయం పొందే ధ్యేయంతో ఇప్పటికే ఇక్కడి వెంచర్లపై కోట్లాది రూపాయలను పెట్టుబడులుగా పెట్టారు. నిరుడు లేఆఫ్‌ల వల్ల రియల్ ఎస్టేట్ మార్కెట్ తగ్గుతూ వస్తున్నది. బెంగళూరు ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమైన ఐటీ ఇండస్ట్రీకి సవాళ్లు ఎదురైతే అది పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

# మొక్కల సంరక్షణకు చర్యలు....



**జనగామ,తెలంగాణ దిశ:** గత హరితహారంలో నాటిన మొక్కలను కాపాడుకుంటూ వచ్చే హరితహారం కార్యక్రమం కోసం సిద్దంగా ఉండాలని అధికార యంత్రాంగానికి జిల్లా డిఆడిఎ అధికారులు సూచించారు. ఎగువప్రాంత జనగామ జిల్లాలో మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పెద్దఎత్తున నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గతేడాది నాటిన మొక్కలు ఎండిపోకుం డా కాపాడాలనిఅన్నారు. స్థానిక అధికారులు వాటి రక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. మొక్కల సంరక్షణ కమిటీలు మండల, డివిజన్ స్థాయిలలో ఉంటాయన్నారు. జాతీయ రహదారి వెంట నాటిన మొక్కల సంరక్షణకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కమిటీలు వేయనున్నామని తెలిపారు. జనగామ జిల్లాలో తెలంగా ణకు హరితహారం పథకంలో భాగంగా ఈఏడాది పెద్దఎత్తున మొక్కలు నాటాలని, గతంలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించు కునే దిశగా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తగిన సూచనలు చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నర్సరీల్లో మొక్కల పెంపకానికి అటవీశాఖ, డీఆర్‌డీఏ నర్సరీల్లో మొక్కల వివరాలపై సమీక్షిం చారు. జిల్లాలో మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రదేశాలను సకాలంలో గుర్తించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు.

అదేవిధంగా గృహ నిర్మాణ సంస్థ అధికారులు జిల్లాలో అమలవుతున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంలో నిర్దేశించిన గడువులోగా ఇళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

# కెనడా సర్కార్ లో ఇద్దరు ఇండియన్స్

న్యూఢిల్లీ: అందమైన, ధనిక దేశం కెనడా. ఈ దేశానికి భారతీయులు విద్య, ఉద్యోగాల కోసం వెళ్తున్నారు. ఇక కెనడా జనాభాలో 6 శాతం సిక్కులు ఉన్నారు. ఆదేశ ఎన్నికల్లో వీరి పాత్ర చాలా కీలకం. అయితే రెండేళ్ల క్రితం వరకు భారత్?కెనడా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. పెట్టుబడులు, దౌత్యపరమైన సంబంధాలు బలంగా ఉండేవి. అయితే ఆ దేవంలో నిజ్జర్ అనే వేర్పాటువాది హత్యకు గురయ్యాడు. దీనికి భారతీ దౌత్య వేత్తలే కారణమని అప్పటి ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు. విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారు. దీంతో అప్రమత్తమైన భారత్.. దౌత్యాధికారులను వెనక్కి రప్పించింది. ఆతర్వాత ట్రూడో కూడా విశ్వాసం కోల్పోయారు. దీంతో నూతన ప్రధానిని ఎన్నుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మార్క్ కార్నీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. కార్నీ కేబినెట్‌లో ఇద్దరు భారత సంతతి మహిళలు, అనితా ఆనంద్ మరియు కమల్ ఖేరా, మంత్రులుగా చోటు దక్కించుకున్నారు. ఈ క్యాబినెట్ మార్చి 14న ఒట్టావాలోని రిడో హాల్‌లో గవర్నర్ జనరల్ మేరీ సైమన్ అధ్యక్షతన జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అధికారికంగా ప్రారంభమైంది అనితా ఆనంద్ (58): ఆమె నావీన్యత, విజ్ఞానం మరియు పరిశ్రమల మంత్రిగా నియమితులయ్యారు. ఆమె 2019లో ఓక్‌విల్లె నుండి మొదటిసారి ఎంపీగా ఎన్నికై, గతంలో ట్రెజరీ బోర్డు అధ్యక్షురాలు, జాతీయ రక్షణ మంత్రి, మరియు పబ్లిక్ సర్వీసెస్ అండ్ ప్రొక్యూర్‌మెంట్ మంత్రిగా పనిచేశారు. నోవా స్కోటియాలో జన్మించిన ఆమె, టొరంటో విశ్వవిద్యాలయంలో చట్ట ఆచార్యురాలిగా పనిచేసిన న్యాయవాది మరియు పరిశోధకురాలు.కమల్ ఖేరా(36): ఆమె ఆరోగ్య మంత్రిగా నియమితులయ్యారు. ఢిల్లీలో జన్మించిన కమల్, చిన్నతనంలో కెనడాకు వలస వచ్చి, 2015లో బ్రాంప్టన్ వెస్ట్ నుండి ఎంపీగా ఎన్నికైంది. ఆమె కెనడా పార్లమెంట్‌లో ఎన్నికైన అతి పిన్న వయస్కురాలైన మహిళల్లో ఒకరు. రిజిస్టర్డ్ నర్సుగా పనిచేసిన ఆమె, కోవిడ్?19 మొదటి వేవ్ సమయంలో బ్రాంప్టన్‌లోని ఆరోగ్య సంస్థల్లో స్వచ్ఛందంగా సేవలందించారు. గతంలో ఆమె సీనియర్స్ మంత్రిగా, అంతర్జాతీయ అభివృద్ధి, జాతీయ ఆదాయ శాఖలలో పార్లమెంటరీ సెక్రటరీగా పనిచేశారు.కార్నీ యొక్క క్యాబినెట్‌లో 13 మంది పురుషులు, 11 మంది మహిళలు ఉన్నారు, ఇది గత ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో యొక్క 37 మంది సభ్యుల బృందం కంటే చిన్నది. 'మేము ఈ క్షణానికి సరిపడే చిన్న, దృష్టి కేంద్రీకరించిన, అనుభవజ్ఞులైన బృందాన్ని రూపొందించాము' అని కార్నీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇద్దరు భారత సంతతి మంత్రులు గత ట్రూడో క్యాబినెట్ నుంచి తమ పదవులను కొనసాగిస్తున్నప్పటికీ, వేర్వేరు శాఖలకు మారారు.

# ఎస్సీవర్గీకరణ హీరోలు మందకృష్ణ, చంద్రబాబు

**వారిద్దరి వల్లనే వర్గీకరణకు న్యాయం దక్కింది**
**మందకృష్ణ గుండె ధర్యంతో మాదిగలకు బలం**
**ఎస్సీవర్గీకరణ చర్చలో పవన్ కళ్యాణ్**




**అమరావతి,తెలంగాణ దిశ:**ఎస్సీ వర్గీకరణ ఈ స్థాయి వరకు వచ్చిందంటే మందకృష్ణ మాదిగ, ఏపీ సీఎం చంద్రబాబు కారణమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగ అని చెప్పగలిగే గుండె ధైర్యం కలిగిన వ్యక్తి మందకృష్ణ. ఆ కులానికి వన్నె తెచ్చిన ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయి. గుర్తింపు లేని కులాలపైనా విస్తృతంగా చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ ఇచ్చిన నివేదిక చాలా అద్భుతంగా ఉంది. ఇది అందరికీ మేలు చేస్తుందని ఆశిస్తున్నట్లు పవన్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ చేసిన చంద్రబాబుకు పవన్ కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణతో అందరికీ మేలు జరుగుతుందని ఆశిస్తున్నట్లు- ఆయన తెలిపారు. మాదగ కులానికి వన్నె తెచ్చిన మందకృష్ణకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై చాలా చర్చలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. అసమానతలపై ఇంకా పోరాటం చేయాల్సి ఉందన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. వర్గీకరణపై ఇచ్చిన మాట సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. కమిషన్ నివేదిక ప్రకారం జిల్లాల వారీగా దామాషా ప్రకారం రిజర్వేషన్ విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. సీఎం చంద్ర బాబు చొరవతో దళితులు అగ్రపథాన నిలిచారని గుర్తు చేశారు. దళితవాడల్లో సంపద సృష్టి జరిగిందని వివరించారు. 800 ఎకరాలు దళితుల భూములు ఇడుపులపాయ ఎస్టేట్‌లో జగన్‌రెడ్డి కుంటుంబం ఆక్రమించుకుందని ఆయన ఆరోపించారు. టీడీపీ మరో ఎమ్మెల్యే కొండ్రు మురళీ మోహన్ మాట్లాడుతూ.. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఎస్సీలకు సంబంధించిన అనేక పథకాలను నిర్వీర్యంచేశారని మండిపడ్డారు. ఎస్సీవర్గీకరణ కోసం టీడీపీ మొదటి నుంచీ కట్టు-బడి ఉందని ఆయన గుర్తు చేశారు. అంతకుముందు ఎస్సీ వర్గికరణపై ఏక సభ్య కమిషన్ నివేదికను మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఉభయ సభల ముందు ప్రవేశపెట్టారు. దీనిపై స్వల్పకాలిక చర్చ జరిగింది. అందులోభాగంగా ఈ అంశంపై సీఎం చంద్రబాబు నాయుడితోపాటు- డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ తదితరులు సభలో మాట్లాడారు.

# ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తు న్నాం...

**విశాఖపట్నం,తెలంగాణ దిశ:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు షెడ్యూల్ కులాల వర్గీకరణపై రాష్ట్ర క్యాబి నెట్ తీర్మానం చేశారని, దీనిని స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజూరి దీపక్ ఆధ్వర్యంలో విశాఖ విజేఏఫ్ ప్రెస్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు మున్నంగి నాగ రాజు మాట్లాడుతూ మాదిగ జాతి చిరకాల ఆకాంక్ష షెడ్యూల్ కురాల వర్గీకరణ నెరవేర్చే విషయంలో ఆగస్టు 1న జస్టిస్ చంద్ర చూడు నాయకత్వంలో ఏడుగురు సభ్యులతో రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణలో రాష్ట్ర ప్రభుత్వాలే వర్గీకరణ చేసుకోవచ్చని సంచల నాత్మక తీర్పును ఇచ్చినట్టు తెలి పారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో తిరిగి 59 ఉప కులాల్లో జనాభా ప్రాతిపదికన సంక్షిప్తంగా నివేదిక తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టు అందించారని తెలిపారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రిపోర్టుపై రాష్ట్ర ప్రభుత్వము, నివేదికను అధ్యయనం చేయ డానికి ఒక సబ్ కమిటీని నియ మించారన్నారు.

# బెర్తుల కేటాయింపులో రైల్వేశాఖ కీలక నిర్ణయం



ఢిల్లీ: ఇండియన్ రైల్వే బెర్తుల కేటాయింపులో కీలక నిర్ణయం తీసుకుంది. సీనియర్ సిటిజన్లు, 45 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళా ప్రయాణికులు, వికలాంగులు, గర్భిణీ స్త్రీలకు బుకింగ్ సమయంలో నిర్దిష్ట ఎంపిక సూచించకపోయినా లోయర్ బెర్తులు కేటాయించబడతాయి. స్లీపర్ క్లాస్‌లో కోచ్‌కు ఆరు నుండి ఏడు లోయర్ బెర్త్‌లు, ఏసీ 3 టైర్ లో కోచ్‌కు నాలుగు నుండి ఐదు లోయర్ బెర్త్‌లు, ఏసీ 3 టైర్ లో కోచ్‌కు మూడు నుండి నాలుగు లోయర్ బెర్త్‌ల ప్రత్యేక కోటా ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం తెలియజేశారు. రాజధాని, శతాబ్ది రకం రైళ్లతో సహా అన్ని మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో, రాయితీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయా లేదా అనే దానితో సంబంధం లేకుండా, వికలాంగుల కోసం రిజర్వేషన్ కోటా వర్తిస్తుంది. స్లీపర్ క్లాస్‌లో నాలుగు బెర్తులు (రెండు లోయర్ బెర్తులు సహా), 3ఏసీ/3ఈలో నాలుగు బెర్తులు (రెండు లోయర్ బెర్తులు సహా), రిజర్వ్ చేయబడిన సెకండ్ సిట్టింగ్‌లో నాలుగు సీట్లు (2ఎస్) లేదా ఏసీ (సీసీ) ఉంటాయి. ప్రయాణం లోలోయర్ బెర్తుల్లో ఖాళీ ఉన్నప్పుడల్లా, సీనియర్ సిటిజన్లు, వికలా ంగులు, గర్భిణీ స్త్రీలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఆయన పార్లమెంటులో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు.

# ప్రజల్లో తగ్గుతున్న కొనుగోలు శక్తి

పెరుగుతున్న ఆర్థిక మాంద్యం, ధరల పెరుగుదలకు తోడు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నిరుద్యోగం తాండవి స్తోంది. దీనికితోడు ప్రల కొఉగోలు శక్తి పూర్తిగా సన్నగిల్లుతోంది. గ దశాబ్దంలో పేదలు బరీ పేదలుగా మారారు. పెద్దలు మరింత పెద్దపెద్ద భవంతులకు చేరుతున్నారు. వారికి డబ్బులు సమకూరుతోంది. ముఖ్యంగా దిగువ మధ్యతరగతి ప్రజలు మరింత పేదలుగా మారుతున్నారు. నిత్యాసవసర వస్తువులను కొనుగోలు చేసే శక్తి సన్నగిల్లుతోంది. ఇదంతా కూడా ఆర్థిక సంక్షోభానికి పరాకాష్టగా చూడాలి. కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర భారత్,ఆ తరువాత వికసిత్ భారత్ అని చెబుతూ, ఆర్థికంగా భారత్ బలోపేతంగా మారిందని నమ్మబలుకుతున్నారు. గ్రామాల్లో పేదల స్థితిగతులు మరితం దుర్భరంగా మారయి, మధ్యతరగతి ప్రజలు తిండికి, వైద్యానికి కూడా నోచుకోవడం లేదు. ఆస్పత్రుల బిల్లులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. ప్రభుత్వం వూద్యం అందడం లేదు. కరోనా అనంతరం మళ్లీ ఆదాయాలు పుంజుకొని అభివృద్ధి ఉరకలు వేస్తుందన్న గారడీ మాటలను ప్రజలు నమ్మడం లేదు. గతంలో క్షీణించిన వృద్ధి రేటు తిరిగి పెరుగుతూ పోతుందన్నారు. బిజెపి పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టదిశగా పరిణామం చెందుతోందన్నారు. అంటే కొద్ది మంది సంపన్నుల సంపద పెరుగుతోందనీ అత్యధికులుగా వున్న మధ్యతరగతి, పేదలు ఇంకా కునారిల్లుతున్నారని గుర్తించడం లేదు. ప్రపంచంలో పేదరికం తగ్గింపు కోసం అనేక దేశాల్లో ఆయా ప్రభు త్వాలు ఆర్థిక విధానాలను రూపొందిస్తున్నాయి. అయితే ముఖ్యంగా సోషలిస్టు దేశాలు ఆదాయ అంతరాల తగ్గింపు కోసం కృషి చేస్తున్నా యి. అందులో భాగంగా సంపద పోగు పడుతున్న వారి నుండి అధిక పన్నులు వసూలు చేయడం, మధ్య, అల్పాదాయ వర్గాల వారికి ప్రభుత్వ తోడ్పాటు పెంచడం వంటి విధానాలు అనుసరిస్తున్నాయి. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వరంగ పాత్రను పెంచుతున్నాయి. ఇంకొన్ని దేశాల్లో ఆదాయంలో పన్ను చెల్లింపు వాటాను కొలబద్ధగా తీసుకొని, అధికాదాయ వర్గాలవారి నుండి ఎక్కువగా వసూలు చేస్తున్నారు. అంతరాల తగ్గింపు లక్ష్యంగా వివిధ చర్యలు చేపడుతున్నారు. అందుకు భిన్నంగా నరేంద్ర మోడీ పాలనలో సంపన్నులపై విధించే కార్పొరేట్ పన్ను తగ్గించారు. వారు బ్యాంకులకు చెల్లించవలసిన లక్షల కోట్ల రూపాయల రుణాన్ని మాఫీ చేశారు. ప్రోత్సాహకాల పేరిట కేంద్ర బడ్జెట్‌లో ఏటా లక్షల కోట్ల రూపాయలు కుమ్మరిస్తున్నారు. మరోవైపున మధ్యతరగతి వారిపై విధించిన ఆదాయ పన్ను ఖజానాకు ఏడాదికేడాది ఎక్కువగా పోగుపడుతోంది. ఇక పేదలను ఎంతలా దిగజార్చుతున్నదీ అందరికీ తెలిసిన విషయమే! ప్రభుత్వ విధానాలే ఆదాయ అంతరాల పెరుగుదలకు కారణం కనుక వాటిని మార్చాల్సిందే. అందుకు బలమైన ప్రజా ఉద్యమాలు కావాలి. తాజా ఆదాయ అంతరాల నివేదిక ఈ విశ్లేషణ ఎంత సత్యమో విదితపరుస్తోంది. దేశంలోని సంపన్నులు జాతీయాదాయంలో తమ వాటాను గణనీయంగా పెంచుకుంటుంటే గ్రామీణ, అల్పాదాయ వర్గాల ప్రజలు అత్యవసర సేవలు, విద్య, ఆరోగ్య రక్షణ, ఆర్థికావసరాలు పరిమితంగానే పొందగలుగుతున్నారని ఆర్థిక సర్వేలు హెచ్చరిస్తున్నాయి. వరల్డ్ ఇనీక్వాలిటీ-డాటాబేస్ (విడ్) ప్రకారం 2023లో దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం ప్రజలు 22.6 శాతం జాతీయాదాయంపై ఆధిపత్యాన్ని చెలాయించారని పేర్కొంది. దేశంలో ఓ మోస్తరు సంపాదన కలిగిన 40 శాతం జనాభా వాటా జాతీయాదా యంలో 43.9 నుండి 46.6 శాతం వరకూ ఉన్నదని కుటుంబ సర్వేలు తెలిపాయి. అయితే విడ్ అంచనాల ప్రకారం జాతీయాదాయంలో మధ్య తరగతి ప్రజల వాటా గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం దేశంలో ఆదాయ అంతరాలు 1950వ దశకంలో కంటే అధికంగా ఉన్నాయని పీపుల్ రిసెర్చ్ ఆన్ ఇండియాస్ కన్స్యూమర్ ఎకానమీ (ప్రైస్) సంస్థ ఇటీవల విడుదల చేసిన పత్రంలోని సమాచారం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లయిడ్ ఎకనమిక్ రిసెర్చ్, ప్రైస్ తదితర సంస్థలు నిర్వహించిన కుటుంబ ఆదాయ సర్వేల ఆధారంగా ఈ పత్రాన్ని రూపొందించారు. అంటే ఆదాయ అంతరం అంతకంతకూ పెరిగిపోతోందన్నమాట. ప్రజలు ఆదాయం కోల్పోవ డంతో ఉచిత పథకాల కోసం ఎగబడు తున్నారు. తమ కులాలకు, వర్గాలకు ఫలానా పథకం వర్తించలేదని గగ్గోలు చేస్తున్నారు. గతంలో వీరంతా ఇలాంటి పథకాల జోలికి రాలేదు. కానీ సంక్షోభం కారణంగా వీరంతా కొనుగోలు శక్తిని కోల్పోయారు. జనాభాలో చివరి 50 శాతంగా ఉన్న పేదలు, అల్పాదాయ వర్గాల ప్రజలు జాతీయాదాయం లో 25.5 నుండి 15.8 శాతం మధ్య ఆదాయ వాటాను కలిగి ఉన్నారని కుటుంబ సర్వేలు తెలిపాయి. కాబట్టి జాతీయ అంతర్జాతీయ నివేదికలు వేటిని పరిశీలించినా అదానీ, అంబానీ, టాటా, బిర్లా వంటి శత కోటీశ్వరుల సంపద పెరగడం, పేదలు మరింత నిరుపేదలవుతున్న వాస్తవాన్ని నివేదిస్తున్నాయి. ఇది ముమ్మాటికీ నిజం. కూలీనాలీ చేసుకునే వారు ఉన్నంతలో పస్తులు లేకెండా గడుపుతున్నారు. అఇతే పేదలు,మధ్యతరగతి ప్రజలు ఎటూ తేల్చుకోలేక నలిగిపోతున్నారు. ఈ పరిస్థితి మారాలంటే కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. ఉపాధి అకాశాలు పెంచడం, ప్రజల కొనుగోలు శక్తి పెంచేలా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా జిఎస్టీ తదితర పన్నులను తక్షణం సమీక్షించాలి.

# సాయం చేయడం ఆదృష్టం..!

**తిరుమల,తెలంగాణ దిశ:**ఎవరికైనా సహాయం చేసే అవకాశం కలగడం ఒక అదృష్టంగా భావించాలి. అలాంటి అదృష్టం మనకు కలగజేసినవాళ్ళకు కృతజ్ఞతలు చెప్పాలి. అప్పుడు మనలో ఏదైనా ఇసుమంత అహంకారం ఉంటేఅది కూడా ప్రక్షాళన అయిపోయి స్వచ్ఛమైన హృదయంతో నిలవగలుగుతాం. ఎవరైనా మనంచేసే సహాయాన్ని పొగడటానికి ప్రయత్నిస్తే 'ఈశ్వరార్పణం' అనే ఒక్కమాటతో సరిపుచ్చవచ్చు. అన్నదానం అనే పుణ్యకార్యాన్ని ఒక ధనికుడు, ఒక పేదవాడు కూడా చేయవచ్చు. ధనికుడు పెట్టినంత రుచికరమైన అన్నాన్ని పేదవాడు పెట్టలేకపోవచ్చు. దాన ఫలితం అన్నంరుచిని బట్టి ఉండదు. ఇంకొకడు తాను తినడానికి చాలినంత లేకపోయినా, ఉన్నదాంట్లోనుంచే ఇంకొకడి ఆకలి తీరుస్తాడు. అతడు దేవుడికి అత్యంత ప్రేమపాత్రుడు. హనుమంతుడు తన గొప్పతనం చూపడం కోసం సముద్ర లంఘనం చేయలేదు. రామదండు కోరిక మేరకు సీతాన్వేషణలో భాగంగా,అంతటి సాహసం చేశాడు. 'నువ్వు చేయగలవు... నువ్వు మాత్రమే ఈ ఘనకా ర్యం సాధించగలవు' అని ఆస్వామికి, ఆయన బలాన్ని క పివీరులు గుర్తు చేశారు. వినయశీలి తన గొప్పతనాన్ని తాను ఎపడూ చెప్పుకోడు! కొద్దినైపుణ్యం ఉన్నంతనే,మరికొంచెం కండబలం ఉన్నంతనే,ఏదో ఒకమార్గంలో సొమ్ము సంపాదించగా నే, విర్రవీగాలని గుణం పుట్టేవాళు – హనుమాన్ దివ్యరూపాన్ని గుర్తుతెచ్చుకుంటే... తమవి కుప్పిగంతులు మాత్రమేనని తెలుసుకోగలుగుతారు!

# బర్లీ పొగాకు రైతులు-సమస్యలు!



గత రెండు మూడు సంవత్సరాలు బర్లీ పొగాకు రేటు లాభసాటిగా ఉండటంతో బర్లీ పొగాకు వైపు రైతులు మళ్లారు. గత సంవత్సరం అడుగు ఆకు కూడా క్వింటాలు పదివేల రూపాయలకు అమ్ముడు పోయింది. ఈ సంవత్సరం అడుగు ఆకు నాలుగైదు వేల రూపాయలకు మించలేదు. కంపెనీలు బాండు ఇచ్చినా పొగాకు కొనటం మందంగా ఉంది. 30-40 వేల రూపాయలకు ఒక ఎకరం పొలం కౌలుకు తీసుకొని, బర్లీ పొగాకు పంటను వేసిన రైతులున్నారు. 2023-24 సంవత్సరంలో భారతదేశ పొగాకు ఎగుమతులు రూ.12,006 కోట్లు. 2022-23లో భారతదేశంలో పొగాకు అమ్మకాల ద్వారా వచ్చిన ఎక్సైజ్ ఆదాయం రూ.72,788 కోట్లు. ప్రభుత్వానికి ఇంత ఆదాయం వస్తున్నా రైతులకు ఆశ, నిరాశలను చూపిస్తూ ప్రభుత్వం, కంపెనీలు రైతులతో ఆడుకుంటున్నాయి. పొగాకు బోర్డు: పొగాకు రైతులకు న్యాయమైన, లాభదాయకమైన ధరలు లభించేలా చూడటం, ఎగుమతులను ప్రోత్సహించటం బోర్డు ప్రాథమిక కర్తవ్యం. అయితే పొగాకు బోర్డు ఒక్క ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా పొగాకు (ఎఫ్.సి.టి) గురించి మాత్రమే పట్టించుకుంటుందట. బర్లీ పొగాకు, నాటు పొగాకు లాంటివి తమ పరిధిలో లేవని తప్పుకుంటోంది. పొగాకు పండించే రైతులందరి ప్రయోజనాలను కాపాడవలసిన పొగాకు బోర్డు%ా%బర్లీ పొగాకు పండించిన రైతులను కంపెనీల దయా దాక్షిణ్యాలకు వదిలేసింది. బర్లీ పొగాకుకు విదేశాలలో ఎక్కువ డిమాండ్ వుంది. అమెరికా, బ్రిటన్‌లో తయారయ్యే సిగరెట్లలో బర్లీ పొగాకు ప్రధాన స్థానాన్ని పొందింది. సిగరెట్‌లో మంచి ఫ్లేవర్ కోసం, ఘాటుగా వుండటం కోసం బర్లీ పొగాకును సిగరెట్ తయారీలో తప్పనిసరిగా వాడతున్నారు. ఇదివరకు అమెరికా లోని కెంటకీ రాష్ట్రంలో బర్లీ పొగాకును ఎక్కువగా సాగు చేసేవారు. అక్కడ బర్లీ పొగాకు సాగు తగ్గింది. దేశ, విదేశీ అవసరాలకు 100 మిలియన్ కేజీల బర్లీ పొగాకు అవసరం వుంటుందని అంచనా.

పొగాకు పరిశోధనా సంస్థ: తూర్పు గోదావరి జిల్లాలో కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ సి.టి.ఆర్.ఐ 75 సంవత్సరాల నుండి రాజమండ్రిలో పనిచేస్తున్నది. దక్షిణ ప్రాంతపు తేలిక నేలలు ఉన్న ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాలలో సాగు చేసే బర్లీ పొగాకు నూతన విత్తనాలను 'విజేత' పేరున విడుదల చేశారు.

ఇదివరకు పది వేల మిలియన్ కేజీల ఎగుమతి ఉన్న బర్లీ పొగాకు ఇప్పుడు 45 వేల మిలియన్ కేజీలకు పెరిగిందని ఆ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు అన్నారు.

ప్రత్యామ్నాయ పంటలైన మిర్చి, శనగ, మొక్కజొన్న, సుబాబుల్, జామాయిల్, పామాయిల్ పంటలు వేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. కానీ ప్రత్యామ్నాయ పంటల ధరలకు గ్యారంటీ లేదు. కనీస మద్దతు ధరలు అమలు పరచే యంత్రాంగం లేదు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత లేదు.

కచ్చితంగా కొంటారనే గ్యారంటీ లేదు. వ్యవసాయ ఖర్చులు-ఎరువులు, పురుగు మందులు, కౌలు, కూలీ రేట్లు భారీగా పెరిగాయి. ఇటువంటి పరిస్థితులలో పొగాకు ధరలు గత రెండు సంవత్సరాలుగా ఆశాజనకంగా వున్నాయి. గతంలో పొగాకు సాగును ఆపేసిన పాత గుంటూరు జిల్లా రైతులు మళ్లీ పొగాకు పంట వైపు మళ్ళారు. పొగాకు సాగు గణనీయంగా పెరిగింది.

పొగాకు బోర్డు పరిధిలో బర్లీ పొగాకు ఎందుకు లేదు? ప్రభుత్వం స్పందించాలి!: ఇండియన్ టొబాకో కంపెనీ, గాడ్ ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్, దక్కన్ టుబాకో, పోలిశెట్టి కంపెనీ, పి.టి.పి, ఎం.ఎల్ మరియు అలియన్స్ వన్ కంపెనీలు బర్లీ పొగాకు సాగును ప్రోత్సహించాయి. కొందరు విత్తనాలిచ్చారు. కొందరు హామీలిచ్చారు. పొగాకు నారును సప్లరు చేశారు. కచ్చితంగా కొంటామని కొన్నిచోట్ల బాండ్లు ఇచ్చారు. పొగాకు బోర్డు పరిధిలో బర్లీ పొగాకు లేకపోవడంతో రైతులకు నష్టం జరుగుతుంది.

బేరన్ పొగాకు / వర్జీనియా పొగాకు సాగు చేస్తున్నటువంటి రైతులకు టుబాకో బోర్డు కొన్ని రక్షణలు కల్పిస్తున్నది. టుబాకో బోర్డు కల్పిస్తున్న రక్షణలు, ప్రయోజనాలు బర్లీ పొగాకు పండించే రైతులకు లేవు. గత సంవత్సరం ధరలు కూడా రావటం లేదు. గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు, కర్నూలు, ఏ ప్రాంతంలో ఏరకమైన పొగాకు, ఎంత మొత్తంలో సాగు చేశారనేది ప్రభుత్వం దగ్గర అంచనాలు ఉన్నాయో లేదో తెలియనటువంటి పరిస్థితి. పొగాకు మార్కెట్లో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే మరెవరు జోక్యం చేసుకుంటారు? పొగాకు బోర్డు తన పరిధిలో లేదంటుంటే ప్రభుత్వం పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. రైతులు నిలువెత్తున మునిగిపోతుంటే చూస్తూ ఊరుకుంటారా?

పంటలకు న్యాయమైన ధరలను సాధించుకోగల శక్తి రైతుల చేతుల్లోనే: ప్రపంచంలోని పొగాకు ధరలు, సిగరెట్ల ధరలు, ఐ.టి.సి, బ్రిటిష్ అమెరికన్ టుబాకో కంపెనీ, ఫిలిప్ మోరిస్ లాంటి బహుళజాతి సంస్థల (యం.యన్.సి) చేతిలో వున్నాయి. వారి లాభాలకు అంతులేదు. వారి నుండి పంటలకు న్యాయమైన ధరలను సాధించుకోగల శక్తి రైతుల చేతులలోనే వుంది. ప్రజా ఉద్యమాలతోనే తమ న్యాయమైన వాటాను సాధించుకోగలరు.


కార్పొరేట్ కంపెనీల చేతులలో కీలు బొమ్మలైన ప్రభుత్వాలు రైతుల ప్రయోజనాలను కాపాడ లేవు. బహుళజాతి సంస్థలు రైతుల సంక్షేమం కోసం ఏర్పడలేదు. గిట్టుబాటు ధరలు కల్పించితే వారి లాభాలు తగ్గిపోతాయి. నీతి, జాతి లేనటువంటి యం.యన్.సి.లు, వారితో పోషింపబడుతున్న ప్రభుత్వాధిపతులు రైతులను కాపాడతారనుకుంటే, గొర్రె కసాయివాడిని నమ్మినట్లవుతుంది. లాభసాటి ధర కావాలంటే రైతులు నిలబడాలి. కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించి అమలు పరచమని పోరాడాలి.




## నార్సింగిలో విచ్చలవిడిగా రెడీమిక్స్ వాహనాలు రాకపోకలు

మణికొండ:గత కొన్ని రోజులుగా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో రెడీమిక్స్ వాహనాలకు నో ఎంట్రీ నిబంధన లేకుండా పోయింది. రాత్రి 10:00 నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు మాత్రమే భారీ వాహనాలను రోడ్లపైకి అనుమతివ్వాలని పోలీసులు నిబంధనలను విధించారు. కానీ నార్సింగి, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రెడీమిక్స్ వాహనాలతో పాటు భారీ వాహనాలు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఫలితంగా పలుచోట్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడగా, మరికొన్ని చోట్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇవన్నీ తెలిసిన ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు "మామూలు"గా తీసుకుంటున్నారు. ఫలితంగా వాహనచోదకులు ప్రమాదాలను ఎదుర్కొంటూ ప్రాణభ యంతో బిక్కుబిక్కుమంటూ వాహనాలను నడుపుకుంటున్నారు. నార్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ సర్వీస్ రోడ్డులో రెడీమిక్స్ వాహనాలు ఇష్టానుసారంగా నడుపుతున్నారు. అదేవిధంగా గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టి నాగులపల్లి ఔటర్ సర్వీస్ రోడ్డుతో పాటు క్యాపిటీ, మైక్రోసాఫ్ట్ జంక్షన్, టీ గ్రిల్ తదితర ప్రాంతాలలో రెడీమిక్స్ వాహనాలతో పాటు భారీ వాహనాలు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు నడుస్తున్నాయి. ఔటర్ సర్వీస్ రోడ్డుపై అతివేగంగా, అజాగ్రత్తగా మైనర్ డ్రైవర్లతో ఈ వాహనాలను నడుపుతుండడంతో ఎప్పుడు ఇలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానిక ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఔటర్ సర్వీస్ రోడ్డు నుంచి ఖానాపూర్ గ్రామం వైపు వెళ్లే రహదారిలో గత కొన్నాళ్లుగా ఓ పంచర్ దుకాణం ఏకంగా రహదారిలోనే వాహనాలను నిలిపి పంచర్ చేస్తున్న దృశ్యాలను నిత్యం ట్రాఫిక్ పోలీసులు చూసి "మామూలు"గా తీసుకుంటున్నారు. ఈ విషయంపై గతంలో నార్సింగి ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎలాంటి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నచిన్న ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిపై తమ ప్రతాపాన్ని చూపే ట్రాఫిక్ పోలీసులు పట్టపగలే ఔటర్ సర్వీస్ రోడ్డుపై రెడీమిక్స్ వాహనాలు కుప్పలు కుప్పలుగా తిరుగుతున్న ట్రాఫిక్ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సదరు రెడీమిక్స్ ప్లాంట్ల యజమానుల వద్ద నుంచి నెలవారి వసూలు చేస్తుండడంతోనే ఆ వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అదేవిధంగా కోకాపేట మైక్రో బిల్డింగ్ ఎదురుగా ఓ నిర్మాణ రంగ సంస్థ ఏకంగా రోడ్డుపై కంటైనర్లు ఏర్పాటు చేసుకుని నిర్మాణాలు చేస్తుంటే ట్రాఫిక్ అధికారులు అటుగా చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతంలో వాహనాలు రాకపోకలను నిలుపుదల చేసి విధులు నిర్వహిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారు తప్ప ట్రాఫిక్ నిబంధనలను ఎక్కడ గాడిలో పెడుతున్నట్లు లేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

## స్టార్ హీరో ప్రేమలో పడ్డ నిధిఅగర్వాల్



సినిమా ఇండస్ట్రీలో చాలా మంది పెళ్లి చేసుకొని కొత్త జీవితాలను ప్రారంభిస్తున్నారు. అలాగే కొంతమంది లవ్ ఎఫర్స్ తో వార్తల్లో నిలుస్తున్నారు. చాలా మంది ముద్దుగుమ్మలు ప్రేమలో తేలిపోతున్నారు. కొంతమంది బిజినెస్ మ్యాన్స్ తో ప్రేమాయణం సాగిస్తుంటే మరికొంతమంది మాత్రంతోటి నటులతో ప్రేమలో తేలిపోతున్నారు. అలాగే ఇప్పుడు ఓ క్రేజీ బ్యూటీ స్టార్ హీరోతో ప్రేమలో పడ్డట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో స్టార్ డమ్ అందుకుంటున్న ఈ బ్యూటీ.. అప్పుడే హీరోతో ప్రేమలో పడటంతో అది కూడా ఓ సీనియర్ హీరోతో ప్రేమాయణం సాగించడంతో అభిమానులు కాస్త నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అమ్మడి కెరీర్ ఖతమ్ అవుతుందని కొందరు నెటిజన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకూ ఆ యంగ్ బ్యూటీ ఎవరు.? ఆమె ప్రేమించిన సీనియర్ హీరో ఎవరు.? అనేది చూద్దాం. తెలుగులో ఎంతో మంది హాట్ బ్యూటీలు ఉన్నారు. ప్రస్తుతం దూసుకుపోతున్న యంగ్ హీరోయిన్స్ వారిలో నిధి అగర్వాల్ ఒకరు. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చింది ఈ వయ్యారి భామ. ఈ ముద్దుగుమ్మ తన అందంతో కుర్రకారును కట్టిపడేసింది. అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య హీరోగా నటించిన సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది నిధి. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత అక్కినేని అఖిల్ తో మజ్ను అనే సినిమా చేసింది. ఆ సినిమా కూడా నిరాశపరిచింది. దాంతో ఈ బ్యూటీకి ఇక అవకాశాలు రావడం కష్టమే అని అనుకున్నారు అంతా.. ఆతర్వాత డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తెరకెక్కించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. ఇక ఈ సినిమాలో నటనతో పాటు గ్లామర్ పరంగాను ఆకట్టుకుంది. డబుల్ ఇస్మార్ట్ సినిమాలో నిధి అందాలకు కుర్రకారు ఫిదా అయ్యారు. ఈ సినిమా హిట్ అయినా కూడా నిధికి అంతగా ఆఫర్స్ రాలేదు. మహేష్ బాబు ఫ్యామిలీ నుంచి వచ్చిన హీరో అశోక్ గల్లా నటించిన హీరో అనే సినిమా చేసింది. ఇక ఇప్పుడు ఈ భామ వరుసగా రెండు భారీ సినిమాలు చేస్తోంది. కెరీర్ ఖతం అయ్యింది అని అనుకునేలోగా ఇద్దరూ బడా స్టార్స్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. నిధి అగర్వాల్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న హరిహరవీరమల్లు సినిమాలో హీరోయిన్ గా చేస్తోంది. అలాగే ప్రభాస్ మారుతి దర్శకత్వంలో వస్తున్న రాజా సాబ్ సినిమాలోనూ నటిస్తుంది. అయితే నిధి అగర్వాల్ తమిళ్ హీరో శింబుతో ప్రేమలో పడిందని ఆమధ్య వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో నిధి ఆ రూమర్స్ ను కొట్టిపారేసింది. ఇప్పుడు మరోసారి నిధి శింబు ప్రేమాయణం గురించి గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవలే టి నగర్‌లోని శింబు ఇంటికి మకాం మార్చినట్టు సమాచారం. ప్రస్తుతం ఇరు కుటుంబాలను ఒప్పించే పనిలో ఉన్నారట.

# పురమిత్ర యాప్‌తో ఎన్నో ప్రయోజనాలు

కాకినాడ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవలందించేందుకు కొత్త అన్వేషణలు చేస్తోంది. ఇప్పటికే వాట్సాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అనే పౌరసేవలను అందిస్తుంది. మరోవైపు రాష్ట్ర పురపాలక మంత్రిత్వ శాఖ ప్రజలకు సేవలను అందించేందుకు "పుర మిత్ర" యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పట్టణ ప్రాంతాల్లో ఉండేవారు పౌర సేవలను సులువుగా పొందేందుకు యాప్ ఉపయోగ పడుతుందని రాష్ట్ర పురపాలక మంత్రిత్వ శాఖ చెబుతోంది. ఈ యాప్‌తో ప్రజలకు సమయం ఆదా అవుతుంది.రాష్ట్రంలోని 95 మున్సిపాలిటీలు ఉన్నాయి. అందులో 17 మున్సిపల్ కార్పొరేషన్లు,78 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయాపట్టణాల్లో ఉండే ప్రజలు పౌర సేవల కోసం మున్సిపల్ కార్యాలయాలచుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉండాల్సి వచ్చేది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయంలో సచివాలయాలు ఏర్పాటు తరువాత, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరిగే వారి శాతం తగ్గింది. ఏ అవసరం వచ్చిన తమ సచివాలయానికి వెళ్లి పనిచేసుకునేవారు. ప్రజలకు అది కాస్త ఉపశమనంగానే ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత డిజిటల్ సేవలను విస్తృతం చేసేందుకు సిద్ధపడింది.మున్సిపల్ కార్యాలయాలకు, గ్రామ సచివాలయాలకు రోజుల తరబడి తిరగాల్సిన పనిలేకుండా, గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన అవసరం లేకుండా ఇంట్లో ఉండే అన్ని సేవలను పొందే విధంగా రాష్ట్ర పురపాలక మంత్రిత్వ శాఖ కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. "పుర మిత్ర" యాప్ ఇక నుంచి ప్రజలకు పౌర సేవలను అందించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీతో రూపొందించిన ఈ యాప్‌లో పలు సేవలు పొందే వీలు కల్పించింది.తమ సమస్యను రోజుల వ్యవధిలోనే పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. సమస్యను పంపేందుకు యాప్‌లో ఫీచర్స్ కూడా పొందుపరిచారు. మన చుట్టూ ఉన్న సమస్యను ఫోటో తీసి, వాయిస్ రికార్డుతో అక్షరాలను టైప్ చేసి పంపించే విధంగా యాప్‌ను తయారు చేశారు. పంపిన సమస్య, ఆ సమాచారం నేరుగా సంబంధిత విభాగాధికారికి వెళ్తుంది. పరిష్కారం చూసేందుకు కనీసం మూడు నుంచి 15 రోజులు, లేదా 30 రోజుల వ్యవధి నిర్ణయించారు. సమస్య తీవ్రతను బట్టీ ఆయా రోజుల్లోపు పరిష్కారం చేస్తారు.రెవెన్యూ, ప్రజారోగ్యం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ ఇలా 150 రకాల పౌర సేవలు "పుర మిత్ర" యాప్‌లో అందుబాటులో ఉంటాయి. పన్ను చెల్లింపులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు ఇలా అన్ని చెల్లింపులు ఇందులోనే చేసుకునే అవకాశం ఉంది. ఈ యాప్ ద్వారా రాష్ట్రంలో ఏ మున్సిపాల్టీలోనైనా కంటికి కనిపించిన సమస్యను పరిష్కారం చేసుకోవచ్చు. కావాల్సిన సేవలను పొందవచ్చు. మనం రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణాలు చేసేటప్పుడు ఆయా పట్టణాల్లో ఉన్న సమస్యను కూడా యాప్ ద్వారా ఫిర్యాదు చేసే సౌలభ్యం ఉంది.ఆ సమస్య పరిష్కారానికి సంబంధించి మనకు తెలియజేస్తారు. సంబంధిత అధికారి గడువులోగా సమస్య పరిష్కరించాలి. పరిష్కారం అయిన ఫోటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు యాప్‌లో సమస్య పురోగతి తెలుసుకునేందుకు వీలు కల్పించారు. అధికారి సందించకపోతే, పై స్థాయి అధికారికి వెళ్లి, చివరికి బియాండ్ ఎస్ఎల్‌లోకి వెళ్లి ఆ అధికారిని బాధ్యుడిగా చేస్తుంది."పుర మిత్ర" యాప్‌ను ప్లేస్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తరువాత దాన్ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అప్పుడు ఓపెన్ బటన్‌ను క్లిక్ చేస్తే ఓపెన్ అవుతుంది. అందులో వివిధ ఫీచర్స్ ఉంటాయి. తెలుగులోనే ఉంటుంది. కనుక యాప్ ఉపయోగించడం చాలా సులువు. ప్రతి ఒక్కరూ యాప్‌ను ఉపయోగించే విధంగా డిజైన్ చేశారు.

## 'ఎస్ఎస్ఎంబి 29' మొదటి షెడ్యూల్ పూర్తి



రాజమౌళి, నటుడు మహేష్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా (ఎస్ఎస్ఎంబి29) మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తయ్యింది. మహేష్‌బాబు, కథానాయిక ప్రియాంకా చోప్రాపై గత 15 రోజుల రెగ్యులర్ షూటింగ్ ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలోని సిమిలిగుడ సమీపంలోని మాలి, పుట్‌సీల్, బాల్డ ప్రాంతాల్లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. నటీనటులను చూసేందుకు పెద్దఎత్తున అభిమానులు, తరలివచ్చారు. పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం నేతృత్వంలో పలువురు ప్రజాప్రతినిధులు చిత్రబృందాన్ని కలిసి అభినందించారు. అధికార యంత్రాంగం బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించింది.

## వరుస సినిమాలలో.. దూసుకెళ్తున్న మీనాక్షిచౌదరి



మీనాక్షి చౌదరి..సుశాంత్ 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' మూవీతో టాలీవుడ్‌ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా చేసిన 'ఖిలాడీ'లో నటించి మెప్పించింది. మాస్ పాటకు స్టెప్పులేసి అదరహో అనిపించింది.హాట్ హాట్ అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెట్టింది. మీనాక్షి చౌదరి. సుశాంత్ 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' మూవీతో టాలీవుడ్‌ను పలకరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాస్ మహారాజా రవితేజ హీరోగా చేసిన 'ఖిలాడీ'లో నటించి మెప్పించింది. మాస్ పాటకు స్టెప్పులేసి అదరహో అనిపించింది. హాట్ హాట్ అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెట్టింది. ఆ తర్వాత అడివి శేష్ సరసన 'హిట్-2'లో చేసింది.

కెరీర్ బిగినింగ్ లో కాస్త స్లోగా సినిమాలు చేసిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోతుంది. కెరీర్ స్టార్టింగ్ లోనే సూపర్ స్టార్ మహేష్ బాబు సినిమాలో నటించే అవకాశం అందుకుంది. మహేష్ బాబు నటించిన గుంటూరు కారంలో నటించి మెప్పించింది. ఇవికాక రీసెంట్ గా విశ్వక్ సేన్, వరుణ్ తేజ్, దుల్కర్ సల్మాన్ హీరోలు సినిమాల్లో నటించి మెప్పించింది. రీసెంట్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకుంది. అలాగే కొన్ని తెలుగు సినిమాలను ఓకే చేసింది. ఇక సోషల్ మీడియా ఈ బ్యూటీ పంచుకునే ఫోటోలు కుర్రాళ్లను తెగ కవ్విస్తున్నాయి. ఇలాంటి లవర్ మనకు రావాలి అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. తన అందంతో అంతలా నెటిజన్స్ ను ఆకట్టుకుంటుంది ఈ చిన్నది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215